ఆంధ్రజ్యోతి



హమ్మయ్య.. మా కర్తవ్యం పూర్తయింది..! పోలింగ్ అనంతరం సోమవారం రాత్రి నెల్లూరులోని ప్రియదర్శిని కాలేజీకి ఈవీఎం యంత్రాలను తీసుకొస్తున్న సిబ్బంది



కావలిలో ఓటు హక్కు వినియోగం కోసం బారులు తీరిన ప్రజలు



ఎంతో కాలంగా ఈ రోజు కోసం ఎదురుచూసినట్టు.. ఎన్నో రోజులుగా అణచిపెట్టుకున్న ఆగ్రహాన్ని ప్రదర్శించే అదను దొరికినట్టు.. ఐదేళ్ల బందీఖానా నుంచి స్వతంత్రపు వాకిళ్లలోకి జొరబడినట్లు, భయం భయంగా బతికే రోజులకు చెల్లుచీటీ రాయడానికి కలబలుక్కొని కదన రంగానికి దూకినట్టు.. నవ్యాంధ్రప్రదేశ్ దిశ, దశ మార్చే అరుదైన అవకాశం చేజార్చుకోకూడదన్నట్టు.. నెర్రెలు చీలిన నేల నుంచి జనం పుట్టుకొచ్చినట్లు ఎటు చూసినా జన సందడే కనిపించింది. పోలింగ్ సందర్భంగా ఏదో జాతర జరిగిన సంబరం కనిపించింది. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల క్యూలైన్లు మానవ పరిమళంతో గుబాళించిపోయాయి. రాత్రి 8 గంటల వరకు ఈవీఎం మిషన్లు ఎడతెరపి లేని ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విధుల్లో కీ...చ్ మనే ఈవీఎంల శబ్దాలతో సప్తస్వరాల అనుభూతిని కలిగించాయి. ఎట్టకేలకు మండే సూరీడు సైతం చిన్నబోయేలా జన ప్రభంజనం పోలింగ్ కేంద్రాలను చుట్టుముట్టింది.





ఓటోత్సాహం!

హక్కు వినియోగానికి కసిగా కదిలొచ్చిన జన సమూహం | **రాత్రి 11 గంటల వరకు క్యూలైన్లలో ఓటర్లు** | **78 శాతానికిపైగా పోలింగ్** | **మెజారిటీ నియోజకవర్గాల్లో 70 శాతానికి పైగా ఓటింగ్** | **అంతా ప్రశాంతం**



ఉలవపాడు : కృష్ణాపురం పోలింగ్ కేంద్రంలో అర్ధరాత్రి 11.30 గంటలకు ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రజలు

నెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : సంతోషమో, తెలియని ఆవేశమో కానీ సోమవారం ఓటేయడానికి జనం పోటెత్తి వచ్చారు. ఉదయం చాలా ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించినా 9 గంటల సమయానికి 9.51 శాతం పోలింగ్ జరిగింది. 11 గంటల సమయానికి అది 23.77 శాతం పెరిగింది. ఆ సమయానికి ఒక్క ఆత్మకూరు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలు వేగం పుంజుకున్నాయి. ఉదయం 11 గంటల సమయానికి నెల్లూరు సిటీ అత్యధికంగా 29.50 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. మధ్యాహ్నం 1 గంట సమయానికి జిల్లా సగటు పోలింగ్ శాతం 42.38 శాతానికి పెరిగింది. ఈ సమయంలో ఉదయగిరి అత్యధికంగా 52.16 శాతం, కోవూరు 47శాతం పోలింగ్ జరిగాయి. సాయంత్రం 3 గంటల సమయానికి పోలింగ్ 58.14 శాతానికి పెరిగింది. ఈ సమయానికి కందుకూరు 65.32, సర్వేపల్లి 61.90 శాతం పోలింగ్‌తో అగ్రస్థానంలో నిలిచాయి. సాయంత్రం 5 గంటల సమయానికి జిల్లా సగటు పోలింగ్ 69.95 శాతానికి చేరుకోగా, కందుకూరు, కోవూరు, సర్వేపల్లి, ఉదయగిరి నియోజకవర్గాలు 74.68 శాతం నుంచి 72.69 పోలింగ్‌తో అగ్రస్థానాల్లో నిలిచాయి. సాయంత్రం 5 గంటల తరువాత కూడా జిల్లా వ్యాప్తంగా మెజారిటీ పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్లలో భారీ సంఖ్యలో ఓటర్లు నిలబడి ఉన్నారు. రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగుతూనే ఉంది. పోలింగ్ పూర్తి అయ్యే సరికి జిల్లా సగటు పోలింగ్ శాతం 80 దాటే అవకాశం ఉందని అధికారుల అంచనా. 2014 ఎన్నికల్లో జిల్లా సగటు పోలింగ్ శాతం 74 కాగా, 2019లో 78 శాతంగా రికార్డు అయ్యింది. ఈ ఎన్నికల్లో సగటు పోలింగ్ 80 శాతం దాటే సూచనలు కనిపిస్తున్నాయి.

కట్టలు తెంచుకున్న ఉత్సాహం

ఓటు హక్కు వినియోగించుకునే క్రమంలో ప్రజల్లో ఉత్సాహం కట్టలు తెంచుకుంది. ప్రధానంగా మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనడం కనిపించింది. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల క్యూలైన్ల వద్ద మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో బారులు తీరి నిలబడి ఉన్న దృశ్యాలు కనిపించాయి. ఉదయం 10 గంటలు దాటితే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో ఉదయాన్నే ఓటు వేయడానికి ప్రజలు భారీగా వచ్చారని, మధ్యాహ్నానికి పోలింగ్ కేంద్రాలు ఖాళీ అవుతాయని అందరూ అనుకున్నారు. అయితే అందుకు భిన్నంగా ఉదయం 7 గంటలకు ఎలా వచ్చారో మధ్యాహ్నం కూడా అదే తరహాలో ఓటేయడానికి ప్రజలు తరలిరావడం గమనార్హం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే ఒరవడి కొనసాగింది. ప్రతి గంటకు 6 శాతం చొప్పున పోలింగ్ శాతం పెరుగుతూనే రావడం దీనికి నిదర్శనం.

టీడీపీలో జోష్..!

పెరిగిన పోలింగ్ కూటమికి అనుకూలమనే అంచనా

అదే కారణంగా వైసీపీకి ప్రతికూల పరిస్థితులు

నెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ భారీగా జరిగితే అది అధికార పార్టీకి ప్రతికూలం అనేది రాజకీయ వర్గాల సిద్ధాంతం. గత రెండు ఎన్నికల పోలింగ్ తీరును గమనిస్తే దాదాపుగా అది నిజమనే తేలింది. 2014లో జిల్లా సగటు పోలింగ్ 74 శాతం. ఆ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకుపోయింది. 2019 ఎన్నికల్లో పోలింగ్ 78 శాతం జరిగింది. ఆ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ జిల్లాలో తుడిచిపెట్టుకొని పోయింది. పదికి పది సీట్లు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీనే గెలుచుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో సోమవారం సాయంత్రం 5 గంటలకే 70 శాతం జరిగింది. అప్పటికీ పోలింగ్‌కు గంట సమయం ఉండగా, క్యూలైన్లలో ఉన్న వారి సంఖ్య ఆధారంగా గమనిస్తే రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఉదయం నుంచి ప్రతి గంటకు 6 శాతం పోలింగ్ పెరుగుతూ వచ్చింది. ఆ కోణంలో చూసినా జిల్లాలో పోలింగ్ 80 శాతం దాటే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఉన్న జననాడి ప్రకారం ఇంత భారీ పోలింగ్ అధికార వైసీపీకే నష్టం. ఆ కోణంలో చూస్తే జిల్లాలో సైకిల్ జోరు పెరుగుతుందని, ఫ్యాను మట్టికరుస్తుందనే అంచనాలు ఊపందుకున్నాయి. పోలింగ్ శాతం పెరగడం అధికార పార్టీకి నష్టం అనే సిద్ధాంతమే నిజమైతే గత ఎన్నికల్లో పదికి పది సీట్లు గెలుచుకున్న వైసీపీ ఈ ఎన్నికల్లో అంతే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు సైతం జిల్లాలో స్వీప్ చేస్తామనే దీమా వ్యక్తం చేస్తున్నారు. ఉదాహణకు సర్వేపల్లి విషయానికి వస్తే గత ఎన్నికల్లో ఇక్కడ 80 శాతానికిపైగా పోలింగ్ జరిగింది. ఆ ఫలితాల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల సమయానికి 73 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ పూర్తయ్యే సమయానికి ఈ సారి కూడా ఈ నియోజక వర్గంలో దాదాపు 80 శాతం పోలింగ్ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కోణంలో చూస్తే ఈ ఫలితాలు ప్రతిపక్ష పార్టీకి చెందిన సోమిరెడ్డికి అనుకూలంగా ఉండాలి. అలాగే కోవూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో సైతం సాయంత్రం 5 గంటలకు దాదాపుగా 70 శాతం వరకు పోలింగ్ జరిగింది. కందుకూరులో అత్యధికంగా 74.68 శాతం పోలింగ్ జరిగింది. అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్ ముగిసే సమయానికి 75 శాతం చేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఎక్కువ శాతం పోలింగ్ కావడం అధికార పార్టీకి నష్టం అనే సిద్ధాంతం నిజమయ్యే పక్షంలో ఈ నియోజకవర్గాల్లో కూడా వైసీపీకి ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఇక నెల్లూరు సిటీ విషయానికి వస్తే పోలింగ్ పర్సంటేజీతో సంబంధం లేని విధంగా ఫలితాలు ఏకపక్షంగా ఉండబోతున్నాయన్న విషయాన్ని వైసీపీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. నారాయణ చేసిన అభివృద్ధి, గత ఆరు నెలలుగా ఆయన, ఆయన కుటుంబ సభ్యులు గడప గడప తొక్కి ప్రచారం చేసిన తీరు, అనిల్ కారణంగా నిలువునా చీలిన వైసీపీ క్యాడర్ ఇవన్నీ నారాయణ గెలుపును నల్లేరు మీద బండి నడక చేశాయని, సిటీ పోలింగ్ నారాయణకు అనుకూలంగా ఏకపక్షంగా జరిగిందని ప్రజలు చెప్పుకొంటున్నారు. వర్గాల వారీగా విశ్లేషిస్తే పోస్టల్ బ్యాలెట్‌లోనే ఉద్యోగ వర్గాలు అధికార పార్టీని మడతపెట్టేశారు అంటే ఆ కుటుంబాల ఓటు తీరు ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పోలింగ్‌లో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వెనుక ఉచిత బస్సు ప్రయాణం, మెగా డీఎస్సీ, ఉద్యోగ, ఉపాధి కల్పన భరోసాలే కారణాలుగా తెలుస్తోంది. అధిక ధరలు, పెరిగిన కరెంటు చార్జీలు, మద్యం ధరలు, నాణ్యత ప్రభావాలు, మచ్చుకైనా కనిపించని అభివృద్ధి తదితర విషయాలపై మధ్యతరగతి కుటుంబాలు అధికార పార్టీ పట్ల వ్యతిరేకంగా ఉన్నారనే ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. ఓటు వేయడానికి జనం దండుకట్టుకొని రావడం ఆ ప్రచారానికి బలం చేకూర్చుతోంది. మొత్తంపై పెరిగిన పోలింగ్ శాతం ఎవరి పుట్టి ముంచుతుందో ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే.



మేమూ.. హక్కు వినియోగించుకున్నా... అంటున్న యువకులు



జిల్లాలో పోలైన ఓట్లు	
నియోజకవర్గం	శాతం
కందుకూరు	82.19
కావలి	81.83
ఆత్మకూరు	82.06
కోవూరు	78.07
నెల్లూరు సిటీ	70.20
నెల్లూరు రూరల్	66.18
సర్వేపల్లి	83.39
ఉదయగిరి	83.64

విజయసాయి వీరంగం !



రేబాలలో విజయసాయిరెడ్డిని చుట్టుముట్టిన టీడీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో ఏర్పాటు చేసిన 52వ పోలింగ్ బూత్ వద్ద సోమవారం నెల్లూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాకం విజయసాయిరెడ్డి కొంతసేపు వీరంగం సృష్టించారు. క్యూలో ఉన్న ఓటర్లకు ఎరగా నీళ్ల సీసాలు పంపిణీ చేశారు. ఓ ఎంపీ అభ్యర్థి ఇలా చేయడం ఏమిటి...? అంటూ రేబాల గ్రామ టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సాయన్న ప్రజలపై జులుం ప్రదర్శించి వీరంగం సృష్టించారు. మర్యాదగా ఇక్కడినుంచి వెళ్లమంటూ వారిని బెదిరించారు. దీంతో టీడీపీ నాయకులు వాదనకు దిగారు. మాటామాటా పెరగడంతో రేబాల నుంచి 400మందికిపైగా ప్రజలు వచ్చి విజయసాయిపై ఆగ్రహించారు. దీంతో ఆయన దూరంగా వెళ్లిపోయారు. ఇంతలో ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అక్కడికి చేరుకుని సాయన్నను వారించబోగా ఆయన వినలేదు. ఇంతలో రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, ఎర్రంరెడ్డి అనుచరులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పార్టీలకు అతీతంగా అక్కడికి వచ్చిన రేబాలవాసులు 'మా రేబాల వాసినే నెడతారా..? వదిలే ప్రసక్తే లేదు' అంటూ విజయసాయిపై ఆగ్రహించారు. ఇంతలో సీఐ హైమారావు అక్కడికి చేరుకుని చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. ఇంతలో బుచ్చి నుంచి వచ్చిన వైసీపీ నాయకులు ఎర్రంరెడ్డికి, టీడీపీ నాయకులకు నచ్చజెప్పి సర్దుబాటు చేశారు. అయినా క్షమాపణచెప్పే వరకు వదిలేదిలేదని వారు చెప్పగా, విజయసాయిరెడ్డిని సీఐ, పోలీసులు, ఇతర వైసీపీ నాయకులు దగ్గరుండి కారులో సాగనంపారు. అలాగే మండలంలోని పోలింగ్ బూత్‌లను సందర్శించిన విజయసాయిరెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి జొన్నవాడ, మినగల్లు, రేబాల సర్పంచులపై, టీడీపీ నాయకులపై ప్రదర్శించిన జులుం, దుర్భాషలు ఆడిన తీరు ఓటర్లను భయాందోళనకు గురిచేశాయి.



ఘర్షణలు.. దాడులు



వెంకటాచలంలో టీడీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్న వైసీపీ శ్రేణులు



కావలిలో ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

కందుకూరు : మండలంలోని ఓగూరులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. తోపులాట సమయంలో ఇనుపరాడ్డు తలకు తగలడంతో ఆయనకు గాయమైంది. అలాగే బంగారమ్మగుడి వద్ద పోలింగ్ కేంద్రంలో సాయంత్రం ఘర్షణ జరిగింది. ఇరువర్గాల మధ్య వివాదం నెలకొనగా వైసీపీ ఏజెంటుపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. ఉలవపాడు మండలం టెంకాయచెట్లపాలెం పోలింగ్ కేంద్రంలోకి తన అనుచరులతో కలిసి వెళ్లేందుకు ప్రయత్నించిన వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదనరావును టీడీపీ కార్యకర్తలు అడ్డగించారు. అభ్యర్థిగా మీరు వెళ్లండి కానీ మీ అనుచరులను ఎలా తీసుకెళ్తారని టీడీపీ కార్యకర్తలు ప్రశ్నించటంతో వివాదం చెలరేగి తోపులాట జరిగింది.

● ముత్తుకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలతో ఘర్షణలు చోటుచేసుకోగా, పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ప్రధానంగా వెంకటాచలం, అనికేపల్లిలో వైసీపీ రౌడీమూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. ఒకరికి కాళ్లు విరగగా, పలువురు గాయపడ్డారు. ఈదగాలి, గొలగమూడి, కందలపాడులో ఇరు వర్గాల మధ్య తోపులాటలతో పాటు వాగ్వాదాలు జరిగాయి. తోటపల్లిగూడూరు మండలం సౌత్‌ఆములూరు, కోడూరు, మండపం, ముత్తుకూరు, కృష్ణపట్నంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన సంఖ్యలో పోలీసులు లేకపోవడంతో వైసీపీ నాయకులను అడ్డుకునే వారు లేకపోయారు.

● కావలి/అల్లూరు : కావలి నియోజకవర్గంలో వైసీపీ మూకలు రెచ్చగొట్టి దాడులకు పురిగొల్పడంతో పలు చోట్ల ఘర్షణలతో దాడులు జరిగాయి. అల్లూ రు మండలం బీరంగుంటలో అల్లూరు మండలంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ వాతావణం నెలకొంది. ఇందులో టీడీపీ కార్యకర్త గాయపడ్డారు. ఇక్కడ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రకు, వైసీపీ నాయకుడు సుకుమార్‌రెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. కావలిలోని ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఓట్లు లేనివారు వచ్చి గొడవపడ్డారు. టీడీపీ, వైసీపీ నాయకులు గొడవ పడ్డారు. పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలను తరిమి కొట్టారు. వైసీపీ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలు దగరుండి తమ అనుచరులతో కేసులు పెట్టించారు. కావలిరూరల్ మండలం తుమ్మల పెంట గురుకుల పాఠశాలలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య తోపులాటలు జరిగాయి. రూ రల్ సీఐ అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదర గొట్టారు. దగదర్తిలో టీడీపీ సానుభూతిపరుడు కిషోర్‌ను వైసీపీకి చెందిన తాళ్లూరు రాజశేఖర్ మరికొందరు గాయపరిచారు.




కందుకూరు: ఓగూరులో గాయపడిన యువకుడు






ఓటు వేసినట్లుగా సిరా గుర్తు చూపుతున్న ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉదయగిరి టీడీపీ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి వి. విజయసాయిరెడ్డి




ఆత్మకూరు, ఉదయగిరి వైసీపీ అభ్యర్థులు విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నెల్లూరులోనే ఓటేసిన అత్యధికులు



ఓటేసినట్లు చేతి వేలిపై సిరా గుర్తు చూపుతున్న వీపీఆర్ దంపతులు



కుటుంబ సమేతంగా సర్వేపల్లి వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం) మే 13 : నెల్లూరు నగరంలో సోమవారం పలువురు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ఓటును వినియోగించుకున్నారు. నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాగుంట లేఅవుట్‌లోని ఎస్‌ఆర్‌కే స్కూల్‌లో తన సతీమణి కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలసి ఓటు వేశారు. సాధారణ ఓటర్‌లాగే క్యూలో నిలబడి హక్కు వినియోగించుకున్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి కొండాయపాళెం 191 పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ రామలింగాపురంలోని 166వ పోలింగ్ బూత్‌లో ఓటును వేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్ జెండావీధి పీఎన్ఎం హైస్కూల్‌లో తన ఓటు వేశారు. నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాగుంట లేఅవుట్‌లోని ఎస్‌ఆర్‌కే స్కూల్‌లో ఓటు వేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి తన ఓటును 16వ డివిజన్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో వినియోగించుకున్నారు. నెల్లూరు నగర మేయర్ స్రవంతి తన భర్త జయవర్ధన్‌తో కలిసి పత్తేఖాన్‌పేట పోలింగ్ కేంద్రంలో తమ ఓటు వేశారు. సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అల్లీపురంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి సంతపేటలోని బీఈడీ కళాశాలలో తన ఓటు వేశారు. నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ కొండాయపాళెంలో వేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ కుటుంబ సభ్యులతో కలిసి హరనాథపురంలోని 166వ బూత్‌లో ఓటు వేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి బాలాజీనగర్‌లో ఓటు వేశారు. డీకేడబ్ల్యూ కళాశాలలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఆయన సతీమణి ఓటు వేశారు. సిటీ ఆర్వో వికాష్ మర్మత్ కూడా ఇక్కడే ఓటేశారు. 16వ డివిజన్ స్వామిదాస్ స్కూల్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.



ఓటు వేసిన నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ



కావలి : ఓటు వేసిన కావ్య క్రిష్ణారెడ్డి



సతీసమేతంగా కలెక్టర్ హరినారాయణన్



నగరంలో ఏర్పాటు చేసిన పింక్ పోలింగ్ బూత్‌లో ఓటేస్తున్న ప్రజలు



కుటుంబసభ్యులతో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



బీద రవిచంద్ర

- ఆగిన విద్యుత్ సరఫరా
- ఇబ్బంది పడ్డ ఓటర్లు, ఎన్నికల సిబ్బంది
- స్ట్రాంగ్‌రూమ్ వద్ద కుప్పకూలిన టెంట్లు



ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

వర్షంతో పోలింగ్‌కు అంతరాయం



ఈవీఎంల పంపిణీ కేంద్రం వద్ద నేలకొరిగిన టెంట్లు

ఉదయగిరి రూరల్, మే 13: ఉదయగిరిలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులలతో భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5.15 నుంచి 7 గంటల వరకు భారీవర్షం కురవడంతో ఓటు వేసేందుకు బూత్‌ల వద్ద క్యూలో ఉన్న ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ ప్రక్రియకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలు సెల్‌ఫోన్ వెలుగుల్లో ఓటు వేయాల్సి వచ్చింది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన కేంద్రాల్లో అధికారులు సైతం సెల్‌ఫోన్ వెలుగుల్లో ఈవీఎంల సీజ్, ఇతరత్రా పనులు చేశారు. పట్టణంలోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు గాలులకు నేలకొరిగాయి. పోలింగ్ అనంతరం ఈవీఎంల అప్పగించేందుకు వచ్చిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులకు వండుతున్న భోజనాలు సైతం వర్షానికి తడిశాయి. భారీవర్షం కారణంగా ఉదయగిరిలో మురికి కాలువలు పొంగిపొర్లడంతో రహదారులపై నీరు ఉధృతంగా ప్రవహించాయి. ద్విచక్ర వాహనాలు సైతం వర్షపునీటిలో మునిగాయి. వర్షం వెలిశాక ఆరు గంటల వరకు క్యూలో ఉన్న ప్రజలకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో రాత్రి వరకు కొన్ని కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది.

రిజర్వు ఉద్యోగుల ఆందోళన

ఉదయగిరి రూరల్, మే 13: పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్ ఎదుట ఎన్నికల విధులకు హాజరైన రిజర్వు ఉద్యోగులు సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రిజర్వులో ఉన్న తమను రిలీవ్ చేసి రావాల్సిన నగదు ఇవ్వాల్సి ఉందన్నారు. తాము ఈ విషయాన్ని పలుమార్లు ఆర్వో దృష్టికి తీసుకెళ్లినా సరైన సమాధానం లేదన్నారు. రిజర్వులో ఉన్న తమకు తాగునీరు, మరుగుదొడ్లు, భోజనం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కొందరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు గురికావాల్సి వచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



స్ట్రాంగ్‌రూమ్ ఎదుట ఆందోళన చేస్తున్న రిజర్వు ఉద్యోగులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	160
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	280
స్కిన్‌లెస్	310
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6872
వెండి కిలో ధర	రూ. 86,000
వెండి ఒక గ్రాము	రూ. 88.00

మా ఓట్లు తొలగించారయ్యా....!



ఓట్లు తొలగించారంటూ నిరసన తెలుపుతున్న చినఅన్నలూరు వాసులు

కలిగిరి, మే 13: 'ఫారమ్-7 నోటీసు ఇవ్వకుండా మా ఓట్లు తొలగించారయ్యా... మాకు న్యాయం చేయండి' అంటూ మండలం లోని చినఅన్నలూరు గ్రామవాసులు చంద్ర శ్రీహరి, శ్రీరాం మురళి, సుబ్బరత్నమ్మ, వెంకటలక్ష్మి, శోభన్‌బాబు, సుభాషిణి, షేక్ మహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమ వారం వారు పోలింగ్ కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. గత ఏప్రిల్ 15న ప్రచురించిన జాబితాలో తమ ఓట్లు ఉన్నాయని, అయితే ఏప్రిల్ 24న విడుదలయిన తుది జాబితాలో తమ ఓట్లను బీఎల్‌వో శేషయ్య వైసీపీ నాయకులకు కొమ్ముకాసి తొలగించారని పేర్కొన్నారు. జీవనోపాధి కోసం వెళ్లి హైదరాబాద్‌లో ఉంటున్నామని, ఓటు కోసం అంతదూరం నుంచి వస్తే జాబితాలో పేరులేదని ఓటు వేయనీయలేదన్నారు. తమ ఓట్లకు అభ్యంతరం పెట్టినవారి వివరాలు కావాలని వీఆర్వోతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై వీఆర్వో శేషయ్యను వివరణ కోరగా ఫారమ్-7నోటీసు ఇవ్వకుండా ఓట్లు తొలగించడం పొరపాటేనని అంగీకరించారు. కాగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ వీఆర్వో ఏకపక్ష నిర్ణయాలపై జిల్లా కలెక్టరుకు, ఈసీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఓటింగ్‌పై నగదు ప్రభావం

- కొన్ని ప్రాంతాల్లోనే పంపిణీపై అసంతృప్తి
- డబ్బులిస్తేనే ఓటేస్తామని కొంతమంది ఓటర్లు
- పోలింగ్ బూత్‌ల వద్ద కూడా అందజేత

నెల్లూరు (వ్యవసాయం), మే 13 : జిల్లాలో సోమవారం జరిగిన ఓటింగ్‌పై కొంతవరకు నగదు ప్రభావం కనిపించింది. ఓ పార్టీ వాళ్ల ఇంటికొచ్చి నగదు పంపిణీ చేయడం, మరో పార్టీ వారు ఇవ్వకపోవడంపై కొన్నిచోట్ల ఓటర్లే బహిరంగంగానే ప్రశ్నించారు. ఈసారి కూడా ఆపార్టీ వారికి దెబ్బేనంటూ హెచ్చరికలు జారీచేశారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఉదయం 6.30 గంటల నుంచే ఓటర్లు తమతమ పోలింగ్‌స్టేషన్ల వద్దకు చేరుకున్నారు. వెంకటేశ్వరపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు కొంతసేపు మొరాయించాయి. దీంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో గర్భిణీలు, మహిళలు ఇబ్బంది పడ్డారు.

నగరంలోని సంతపేట, రంగనాయకులపేట పీఎంఆర్ హైస్కూల్, బీఈడీ కళాశాల, గుంటబడి, సెయింట్ జోసెఫ్ పాఠశాల, గుప్తాపార్కు సెంటర్, కుక్కలగుంట తదితర ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని చోట్ల కూలర్లు ఏర్పాటు చేయడంతో ఓటర్లు సేదతీరారు. వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. కొంతమంది ఓటర్లు తమకు నగదు అందలేదంటూ పోలింగ్ స్టేషన్ల వద్ద ఉన్న రాజకీయ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు బహిరంగంగానే నగదు పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల క్యూలైను లో ఉన్న ఓటర్లను తమ పార్టీకి ఓటేయాలంటూ నేతలు కోరగా, పోలీసులు వారిని హెచ్చరించి బయటకు పంపిం చారు. నగదు పంపిణీ సక్రమంగా చేయలేదంటూ కొందరు స్థానిక నేతలపై బహిరంగంగానే విమర్శలు చేయడం కనిపించింది.

పోరాడి ఓటేసిన మహిళ

నెల్లూరు (సాంస్కృతికం) మే 13 : నెల్లూరులోని ఓ మహిళ పోరాడి చాలెంజ్ ఓటు వేశారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు నగర నియోజకవర్గంలోని తెలుగుగంగ కాలనీలో గల 55వ నెంబరు పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు కరెంటు ఆఫీసు సెంటర్ నుంచి బండారు విజయలక్ష్మి వచ్చారు. ఆమె బూత్‌లోకి వెళ్లేసరికి ఆమె ఓటును ఎవరో వేశారని ఎన్నికల సిబ్బంది చెప్పారు. తన ఓటును ఎలా వేయనిచ్చారు... అంటూ ఆమె పోలింగ్ సిబ్బందితో గొడవపడ్డారు. తన ఓటు వేసిన వారి ఆధార్ నెంబరు కావాలని కోరారు. వారు దొంగ ఓటు వేసిన మహిళ ఆధార్ నెంబరు చివరి నాలుగు అంకెలను మాత్రమే వారు ఇచ్చారు. దీనిపై సీ విజిల్‌కు ఆమె ఫిర్యాదు చేశారు. ఆర్వో దృష్టికి కూడా తీసుకెళ్లారు. రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నారు. దీంతో ఆర్డీవో పోలింగ్ అధికారికి ఫోన్ చేసి చాలెంజ్ ఓటు ఇవ్వమని ఆదేశించారు. ఆయన చాలెంజ్ ఓటు ఇవ్వ కుండా ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సీ విజల్ అధికారి నేరుగా పోలింగ్ బూత్‌కు వచ్చి, పోలింగ్ అధికారితో చాలెంజ్ ఓటు ఇప్పించారు. దీంతో ఆమె హక్కు వినియోగించుకున్నారు. ఓటు కోసం ఆమె నాలుగు గంటలు పోరాడారు.



నెల్లూరు : తెలుగుగంగ కాలనీలోని 55వ బూత్‌లో చాలెంజ్ ఓటు వేసిన బండారు విజయలక్ష్మి

బుజబుజనెల్లూరులో ఉద్రిక్తత

- యథేచ్ఛగా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన
- పోలింగ్ బూత్ ఎదుటే వైసీపీ నేతల తిష్ఠ
- పోలీసుల సాక్షిగా టీడీపీ నాయకులపై దౌర్జన్యం



బీబీ నెల్లూరులోని ఓ పోలింగ్ బూత్ ఎదుట కుర్చీల్లో కూర్చున్న వైసీపీ నేతలు

నెల్లూరు (విద్య), మే 13 : పోలింగ్‌లో భాగంగా సోమవారం నెల్లూరు రూరల్ పరిధిలోని బుజబుజనెల్లూరు (బీబీ నెల్లూరు)లో ఉద్రిక్తత నెలకొంది. బూత్‌లకు వంద కిలోమీటర్ల పరిధిలో ఓటర్లు తప్ప ఎవరూ ఉండకూడదన్న నిబంధనలు ఉన్నా, 144 సెక్షన్ అమలు చేసినా కూడా వైసీపీ నేతలు ఇష్టానుసారం వ్యవహరించారు. దీంతో ఓటర్లను ప్రలోభపెడుతూ ఓటింగ్ నిర్వహిస్తున్నారంటూ టీడీపీ నేతలు ఆందోళనకు దిగారు. పూర్తి స్థాయిలో బూత్‌లను తమ ఆధీనంలోకి తీసుకుని ఏజెంట్లను సైతం భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ టీడీపీ నేతలు ఆరోపించారు. ఒకానొక దశలో ఇరువర్గాలు బాహాబాహికి దిగే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అక్కడ విధుల్లో ఉన్న ముగ్గురు పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించి వేశారు. సాయంత్రం ఓటర్లు అధికంగా రావడంతో తిరిగి వైసీపీ నేతలంతా పెద్ద ఎత్తున బూత్ నెంబర్ 58, 59, 67ల వద్దకు చేరుకున్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రచారం చేస్తుండడంతో టీడీపీ నేతలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. అదే సమయంలో అక్కడకు చేరుకున్న స్థానిక పోలీస్ అధికారి ఇరువర్గాలకు సర్దిచెప్పే టీడీపీ వారిని పోలింగ్ బూత్‌లకు వంద అడుగుల దూరంలో ఉండాలంటూ పంపించి వేశారు. అయితే తమను పోలింగ్ బూత్‌లకు దూరంగా పంపించి వేసిన పోలీసులు వైసీపీ వారిని మాత్రం బూత్‌లలోనే ఉంచడంతోపాటు వారికి కుర్చీలు వేసి మరీ కూర్చోబెట్టారంటూ టీడీపీ నేతలు ఆరోపించారు. పోలీసులు ఇవేమీ పట్టించుకోకుండా వైసీపీ నేతలకే వత్తాసు పలికారు. తమకు మాత్రం ఎన్నికల నిబంధనలు అడ్డువస్తాయని, వైసీపీ నేతలకు మాత్రం అడ్డురావా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీస్ అధికారి, సిబ్బంది నెమ్మదిగా అక్కడ నుంచి వెళ్లిపోయారు.ఓటింగ్ సజావుగా సాగకుండా అడ్డంకులు సృష్టించడంతోపాటు మరోసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని అల్లర్లు, అరాచకాలు సృష్టించాలని చూడడం అన్యాయమంటూ టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు చేసిన అల్లరి కారణంగా చాలామంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోకుండానే ఇళ్లకు వెళ్లారని టీడీపీ నేతలు తెలిపారు. ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



పోలింగ్ బూత్ ఎదుట పెద్ద ఎత్తున గుమికూడిన వైసీపీ నేతలు

చెదురుమదురు ఘటనలు మినహా

పోలింగ్ ప్రశాంతం



వలేటివారిపాలెం : బడేవారిపాలెంలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి నాగేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యులు

కావలి, మే 13: కావలి పట్టణంలో ఓమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చెదురుమదురు ఘటనలు మినహా పో



కావలి 13వ వార్డులో ఓటేసిన ఆర్వో శీనానాయక్

లింగ్ ప్రశాంతంగా జరిగింది. ముసునూరులో ఇరువర్గాలు ఘర్షణ, పాతూరులో అడుగడుగున ఆటంకాలతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీస్‌లు వైసీపీ క్యాడర్‌ను వదిలి వేసి టీడీపీ క్యాడర్‌ను ఇబ్బందులు పెడుతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక దశలో టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సీఐ రాజేష్‌తో మా వారిని ఇబ్బందులు పెట్టవద్దని చెప్పారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో వాటి నుంచి రక్షణ పొందేందుకు ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అయితే అనేక చోట్ల ప్రారంభంలోనే ఈవీఎంలు మొరాయించటంతో వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చేసరికి అర్థగంట నుంచి గంట వరకు పోలింగ్ ఆగడంతో ఓటర్లు క్యూలో నిరీక్షించారు. కొందరు క్యూలో ఉండలేక వెనుదిరిగి వెళ్లారు. అనేక చోట్ల ఓటర్లకు సరిపడా షామియానాలు లేకపోవడంతో ఎండలో ఇబ్బందులు పడారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి వసతి లేదు. కొన్ని పోలింగ్ బూత్‌లలో లైటింగ్ వసతి లేక ఓటు వేసేందకు సక్రమంగా కనపడక ఇబ్బందులు పడటంతో ఆ తర్వాత లైట్లు తెచ్చి బిగించారు. అలాగే వృద్ధులను ఓటుకు తీసుకెళ్లేందుకు అవసరమైన వీల్ చైర్లు, సహాయకులను ఏర్పాటు చేయలేదు. పోలీస్ సిబ్బంది తగినంత మది లేకపోవడంతో అనేక పోలింగ్ బూత్‌ల వద్ద వివాదాలు జరిగాయి.

పెదపట్టపుపాలెం, చెన్నాయపాలెంలో...



వెంగళరావునగర్‌లో బారులు తీరిన ఓటర్లు

కావలి రూరల్ : మండలంలో తుమ్మలపెంట, ఆముదాలదిన్నెలో చిన్న చిన్న ఘటనల మనహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వృద్ధులు, దివ్యాంగులతో పాటు, చంటిబిడ్డలతో వచ్చిన దంపతులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెంలో సాయంత్రం 6 గంటలకు క్యూలైన్‌లో ఓటర్లు ఉండడంతో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఆముదాలదిన్నె పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీకి చెందిన ఏజెంట్లు తిరుగుతున్నా పట్టించుకోకుండా తమను అడ్డుకుంటున్నారని టీడీపీ ఏజెంట్లు పోలీసులతో వాగ్వివాదం జరిగింది. అనంతరం పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఇరు పార్టీలు వేసుకున్న షామియానా టెంట్లను పోలీసులు కూలదోశారు.

ముగిసిన పోలింగ్



బోగోలులో సాయంత్రం బారులు తీరిన ఓటర్లు

బిట్రగుంట : బోగోలు మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరినా మధ్యాహ్నం సమయంలో మందకొండిగా సాగింది. 4 గంటల నుంచి మళ్లీ పోలింగ్ ఊపందుకుంది. బోగోలులో కొన్ని బూతులలో రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దగదర్తిలో వాగ్వివాదం

దగదర్తి మండలంలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సర్దిచెప్పారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ రవీంద్రనాయుడు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.

ఘర్షణ.. పలువురికి గాయాలు

అల్లూరు : మండలంలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. గోగులపల్లిలో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బలగాలు అధికంగా లేకపోవడం, ఉన్నవారు వైసీపీకి మద్దతుగా నిలవడంతో అల్లూరు, బీరంగుంటల్లో వాగ్వివాదాలు, తోపులాటలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మండలంలో ఇస్కపల్లిలో వైసీపీకి చెందిన ఓ కార్యకర్త తరచూ పోలింగ్ కేంద్రంలోకి వచ్చి వెళుతుండడంతో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ గమనించి అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీనికి ప్రత్యర్థి వర్గమైన బీద రమేష్ గిరిధర్‌ను తన మనిషిని నిలువరిస్తావా అంటూ వాగ్వాదానికి దిగాడు. ఇది కాస్తా తోపులాటకు దారితీసింది. ఇరువర్గాలు భారీస్థాయిలో చేరుకొని ఘర్షణకు దారి తీసే పరిస్థితి చోటు చేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను అక్కడ నుండి పంపించేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు స్వగ్రామమైన ఇస్కపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మండలంలోని నార్తుమోపూరు, అల్లూరులోని కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



అల్లూరులో బారులు తీరిన ఓటర్లు

కార్యకర్తల జోలికొస్తే సహించం : కావ్య



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కావ్య కృష్ణారెడ్డి

బీరంగుంటలో జరిగిన ఘర్షణలో గాయపడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. అల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుమలశెట్టి శ్రీనివాసులు, పొంకం సుధాకర్, పొంకం సురేష్, పొంకం విజయ్‌లను ఆయన కలుసుకొని వివరాలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, మాలేపాటి సుబ్బానాయుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాత్రి 8 గంటల వరకు పోలింగ్



కందుకూరు పింక్ పోలింగ్ కేంద్రంలో...

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఆరున్నర నుంచే ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కందుకూరు పట్టణం, రూరల్ మండలంలోని పోలింగ్ కేంద్రాలలో పలు పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించారు. వివిధ కారణాలతో పోలింగ్ ఆలస్యం కాగా సాయంత్రం 6 గంటల ముందు కూడా వందల సంఖ్యలో ప్రజలు క్యూలైన్లకు చేరుకోవడంతో అనేక పోలింగ్ కేంద్రాలలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది. పట్టణంలోని 103, 125, 130, 132 పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించాయి. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు లేక ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఎండలోనే క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఒక్కో కేంద్రం వద్ద పట్టుమని పది కుర్చీలు కూడా లేకపోవటంతో వృద్ధులు, దివ్యాంగులు గంటలకొద్దీ క్యూలైనులో నిల్చోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు పట్టణంలోని ఎక్కువ పోలింగ్ కేంద్రాలను సందర్శించగా వైసీపీ అభ్యర్థి బుర్రా బుర్రా మధుసూదనరావు ఉలవపాడు, గుడ్లూరు మండలాలపై పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి తన స్వగ్రామమైన మాచవరంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం పట్టణంలోని బంగారమ్మ గుడివద్ద పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కాగా కందుకూరు పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి వేయటంతో ఈ వాతావరణం నెలకొంది.

మొరాయించిన ఈవీఎంలు

గుడ్లూరు : గుడ్లూరులోని 182, 184, 186 పోలింగ్ కేంద్రాలతోపాటు పలుగ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచే ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లో నిరీక్షించి ఎండతీవ్రతకు ఇబ్బందిపడ్డారు. మంచినీరు, విద్యుత్ వసతి కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. గుడ్లూరులోని 186, 182, 180 బూతులలో మహిళలు, పురుషులకు ఒకే క్యూలైన్ ఉండడంతో తోపులాట



గుడ్లూరులో ఓటర్ల క్యూ

జరిగింది. అడవిరాజుపాలెంలో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన కొద్దిసేపటికే ఇరుపార్టీలకు చెందిన ఏజెంట్ల మధ్య తోపులాట జరగడంతో ప్రారంభంలోనే గంటపాటు పోలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. తో పులాటలో పోలింగ్ కేంద్రం గది తలుపు చెక్కల మధ్య చేతి వేళ్లుపడి అడవిరాజుపా లెం ఎస్సీకాలనీకి చెందిన ఏ లాజర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గుడ్లూరు, అడవిరాజుపాలెం, అమ్మవారిపాలెం, చినలాటవరపి, చేవూరు, రావూరు పోలింగ్ కేంద్రాలకు సరిపడ పోలీస్ సిబ్బందిని కేటాయించకపోవడంతో ఓటర్ల మధ్య తోపులాట జరిగింది. చినలాటవరపి పంచాయతీలోని 197వ బూత్‌లో ఈవీఎంలు తరచూ మొరాయిస్తుండడంతో అక్కడి ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ప డ్డారు. సాయంత్రం 6 గంటల తరువాత కూడా ఓటర్లు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. గుడ్లూరులోని 7 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ పక్రియను వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పరిశీలించారు.



వలేటివారిపాలెం : ఓటు వేసిన ఎమ్మెల్సీ తూమాటి...

స్వల్ప ఉద్రిక్తత

వలేటివారిపాలెం : మండలంలో స్వల్ప ఉద్రిక్తల మధ్య పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలకు క్యూలో ఓటర్లు ఉండడంతో పోలింగ్ కొనసాగింది. రాత్రి 7:30 గంటల వరకు 70 శాతం పోలింగ్ నమోదైంది. పోలినేనిపాలెం, కళవళ్ల, అయ్యవారిపల్లె, అత్తింటివారిపాలెం, తదితర గ్రామాల్లో ఈవీఎంలు మొరాయిండంతో పోలింగ్ రాత్రి 9 గంటల వరకు కూడా కొనసాగనుంది. పోలినేనిపాలెంలో ఈవీఎం మొరాయించి సుమారు 3 గంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. పోలినేనిచెరువు పంచాయతీలోని పెద్దఅమ్మపాలెంలో ఈవీఎం మొరాయించడంతో మధ్యాహ్నం అర్థగంట పోలింగ్ నిలిచిపోయింది. చుండిలో ఓటు వేసే విషయంలో ఇరుపార్టీల ఏజెంట్ల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అదే గ్రామంలో వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ తనయుడు పోలింగ్ సరళిని తెలుసుకుంటుండగా టీడీపీ ఏజెంట్‌లు త్వరగా బయటకు వెళ్లాలని అభ్యంతరం చెప్పడంతో ఇరు పార్టీల మధ్య వాగ్వివాదం జరిగింది. కొండసముద్రంలో క్యూలో నిలబడిన మహిళా ఓటరు సొమ్మసిల్లి పడిపోయింది. బడేవారిపాలెంలో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలినేనిపాలెంలో ప్రకాశం జిల్లా ఉమ్మడి ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ వలేటివారిపాలెం పోలింగ్ బూత్‌ను పరిశీలించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

పోలింగ్ బూత్ వద్ద బుర్రా హల్‌చల్

ఉలవపాడు : కరేడు పంచాయతీ టెంకాయచెట్లపాలెం పోలింగ్ బూత్‌లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ స్థానిక వైసీపీ నాయకులతో కలిసి హల్‌చల్ చేశారు. మందిమార్బలంతో అక్కడికి చేరుకున్న ఆయన అందరితో కలసి పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. అభ్యర్థి ఒక్కరే లోపలకు వెళ్లవచ్చని, ఇతరులు ఎక్కడి నుంచో వచ్చి ఈ పోలింగ్ బూతులోకి వెళ్లడానికి అంగీకరించమని అడ్డుకోవడంతో



వైసీపీ అభ్యర్థి బుర్రాని అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు

అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే కరేడు పంచాయతీలోని 224 పోలింగ్ బూత్‌లో స్థానిక వైసీపీ కార్యకర్త టీడీపీ పోలింగ్ ఏజెంట్‌పై బూత్‌లోనే కుర్చీ విసిరేసి కలపడ్డాడు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. కాగా మండలంలో సార్వత్రిక ఎన్నికలు ఒకటి రెండు చోట్ల తప్ప ప్రశాంతంగా ముగిశాయి. అలగాయపాలెం బూత్‌లో మధ్యాహ్నం 30 నిమిషాలపాటు ఈవీఎం మొరాయించింది. ఉలవపాడులోని 241, 245 బూత్‌లలో ఒక్కొక్క బూత్‌లో 1200 మంది ఓటర్లు ఉండటంతో పోలింగ్ రాత్రి 7.30 వరకు జరిగింది. అదే విధంగా చాకిచర్ల 262, 264 బూత్‌లలో కూడా సుమారు 8 గంటల వరకు పోలింగ్ జరిగింది.

పోటెత్తిన ఓటర్లు

లింగసముద్రం : మండలంలో పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. దీంతో సుమారు 90 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఉట్లవారిపా



వాకమళ్లవారిపాలెం రాత్రి 9 గంటలకు క్యూలో...

లెం, వాకమళ్లవారిపాలెం, వీఆర్ కోట పోలింగ్ కేంద్రాల్లో సుమారు గంటసేపు ఈవీఎంలు మొరాయించాయి. అలాగే మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రంలోని పోలింగ్ బూతులలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. కందుకూరు డీఎస్పీ ఏ శ్రీనివాస్, గుడ్లూరు సీఐ సుబ్బారావు, ఎస్సై బాజీబాబులు సిబ్బందితో తరలి వచ్చి సర్దుబాటు చేశారు. లింగసముద్రం, పెదపవని, వాకమళ్లవారిపాలెం గ్రామాలలో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. వాకమళ్లవారిపాలెం బూతులో సాయంత్రం 5 గంటల సమయంలో వీవీ ప్యాట్ స్లిప్ బాక్స్‌లో పడక పోవడంతో టీడీపీ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సుమారు 3 గంటల పాటు పోలింగ్ ఆగిపోయింది. డీఎస్పీ శ్రీనివాస్ వచ్చి ఇరువార్గలతో మాట్లాడి మరో వీవీ ప్యాట్ బాక్స్‌ను ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించారు. అయితే పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పెద్దగా లేకపోవడం విశేషం.

ఆత్మకూరు : నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో కొన్ని చోట్ల స్వల్ప ఘర్షణలు, తోపులాటలు మినహా ప్రశాంతంగా జరిగింది. మర్రిపాడు మండలం చుంచులూరు, అనంతసాగరం మండలం ఎగువపల్లిలోని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అనంతసాగరం మండలం మినగల్లులో 85 పోలింగ్ కేంద్రలో ఈవీఎం మిషన్ పనిచేయకపోవడంతో కొంతసేపు ఓటర్లు నిరీక్షించారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెంలో ఒకేచోట రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఓటర్లు కిక్కిరిసిపోయారు. దానికి తోడు పోలింగ్ కేంద్రాల్లో సరిగా కిటికీలు లేకపోవడంతో ఊపిరాడక 7 మంది మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. దాంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చే యడంతో కొంతసేపు పో లింగ్‌కు అంతరాయం కలిగింది. టీడీపీ అభ్య ర్థి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని సంతపేటలో కాంగ్రెస్ అభ్యర్థి చేవూరు శ్రీధర్ రెడ్డి ఆత్మకూరులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి గూటూరు మురళీకన్నబాబు కరటంపా డులో, జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆత్మకూరులో తమ ఓటును వేశారు. హింసాత్మక ఘటనలు లేకుండా ఎన్నికల అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.

ఏఎస్ పేట : మండలంలోని అనుమసముద్రం,



ఆత్మకూరు : కరటంపాడులో ఓటర్ల బారులు



ఏఎస్‌పేట : సాయంత్రం 6 తరువాత క్యూలో...

అబ్బసాహెబ్ పేటలో సాయం త్రం 6గంటల తరువాత కూడా క్యూలో ఓ టర్లు ఉండడంతో 7గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అబ్బాసాహెబ్ పేట ఈవీఎం మిషన్లు మొరాయించడంతో రాత్రి 9:10 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. గండువారిపల్లి, పెద్దహబీపురం చౌటభీమవరం, చందులూరుపాడులో 90శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

మర్రిపాడు : మండలంలో 35,364 మంది ఓటర్లు ఉండగా 82శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్రాంహ్మణపల్లిలో ఆత్మకూరు వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటును



సంగం: చంటి బిడ్డలతో పోలింగ్‌కు వచ్చిన తల్లులు

వినియోగించుకున్నారు.

సంగం: చెన్నవరపాడులో తప్ప మిగిలిన చోట్ల ప్రశాంతంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7-00లకే పోలింగ్ ప్రారంభమవగా సంగంలోని 209, 220, 224, 261వ పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో దాని స్థానంలో మరొక ఏర్పాటు చేయడంతో 15 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. 208 పోలింగ్ కేంద్రంలో సిబ్బంది వల్ల మాక్ పోలింగ్ ఆలస్యంతో 15 నిమిషాల ఆలస్యం అయ్యింది. చెన్నవరపాడులో ఓ మహిళ ఓటు విషయంపై ఇరువర్గాలు వాదన పడి ఘర్షణ పడారు. ఈ ఘర్షణలో డిల్లీబాబు అనే వ్యక్తికి స్వల్ప గాయాలైనాయి. పెరమన, మక్తాపురం, అనసూయనగర్ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సమయం ముగిసే సమయంలో ఓటర్లు ఒక్కసారిగా రావడంతో రాత్రి వరకు పోలింగ్ జరిగింది.

అనంతసాగరం : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల సరళి ఆలస్యంగా జరగడంతో క్యూలైన్‌లో ఓటర్లు గంటల తరబడి నిరీక్షించారు. వృద్ధులు, గర్భవతులు, వికలాంగు



ఏ సాగరం : సోమశిలలో నీరసించిన మహిళలు

లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంతో అవస్థలు పడ్డారు. లింగంగుంటలో ఈవీఎం మొరాయించడంతో ఉదయం 9-30 గంటల వరకు ఓటింగ్ జరగలేదు. మినగల్లు, అగ్రహారం, కొత్తపల్లి, ఎగువపల్లిలో వైసీపీ, టీడీపీ శ్రేణులు మధ్య గొడవ జరగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సాయంత్రం ఆరు గంటల వరకు కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కమ్మవారిపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద రిజర్వు ఇన్‌స్పెక్టర్ ధామస్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించాడని ఆగ్రహించి ఆయనతో వాదనకు దిగారు. సమాచారం తెలుసుకొన్న అదనపు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైనా 9 గంటల వరకు 1.61 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఓటర్లకు పంపిణీ చేసే డబ్బులను స్థానిక నాయకులు నొక్కేశారని ఆరోపణలు చేస్తూ ఓటర్లు ఓటు వేసేందుకు రాకుండా ఇళ్లల్లోనే ఉండి పోయారు. టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకొన్నారు. పలు మండలాల్లో కురిసిన వర్షానికి పోలింగ్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. వరికుంటపాడులోని 84, 85 పోలింగ్ బూత్‌లతో పాటు ఉదయగిరి మండలంలోని గంగిరెడ్డిపల్లి, దుర్గంపల్లి, కలిగిరి, వింజమూరు, దుత్తలూరులోని ఈవీఎంలు మొరాయించారు. ఉదయగిరి, సీతారామపురం, బసినేనిపల్లి, సింగారెడ్డిపల్లి, వరికుంటపాడు మండలంలోని తోటలచెరువుపల్లి, నార్త్‌కొండాయపాళెం, కనియంపాడు, తూర్పురొంపిదొడ్లలో చిన్నపాటి ఘర్షణలతోపాటు తోపులాటలు జరిగాయి. పోలీసులు రంగ



ఉదయగిరి పోలింగ్ కేంద్రంలో...

ప్రవేశంతో సమస్య సద్దు మణిగింది. కృష్ణంపల్లి పోలింగ్ కేంద్రంలో వైసీపీ నాయకులు, ఏపీవో మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొంది. వృద్ధుల ఓట్లను పోల్ చేసే క్రమంలో ఏపీవో టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వాదనకు దిగారు. ఈ విషయాన్ని నాయకులు ఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఏఆర్వో నెహ్రూబాబు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని నాయకులతో చర్చించి ఏపీవోను ఉదయగిరికి తరలించారు. కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరడంతో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ అనంతరం 8 మండలాల పరిధిలో పోలింగ్ కేంద్రాల నుంచి బస్సుల ద్వారా ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు, ఇతర ఎన్నికల సామాగ్రిని ఉదయగిరిలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.

వింజమూరు: మండలంలో చెదురుమదురు సంఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రధాన పార్టీ వారు కూడా పోటాపోటీగా ఓటర్లను తరలించి ఓటుని వేయించారు. కాగా స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అల్లూరు : నార్తుమోపూరులో వేమిరెడ్డి



కర్ఫ్యూను తలపిస్తున్న కందుకూరు పట్టణం

వరికుంటపాడు: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఉద్రిక్త పరిస్థితుల నడుమ సాగాయి. కొంత సమయం సజావుగా సాగినప్పటికి ఆపై తోటలచెరువుపల్లి, నార్త్‌కొండాయపాలెం, నార్త్‌కృష్ణంరాజుపల్లి, విరువూరు, జడదేవి, తూర్పుగొంపిదొడ్ల, రామదేవులపాడు, వరికుంటపాడు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ వర్గీయల మధ్య చోటుచేసుకొన్న వాగ్వివాదాలు తోపులాటతో పాటు ఉద్రిక్త పరిస్థితులు



కలిగిరి: వీల్‌చైర్లో వృద్ధురాలిని తరలిస్తున్న సిబ్బంది

నెలకొన్నాయి. తిమ్మారెడ్డిపల్లి, తూర్పుబోయమడగల, దక్కనూరు గ్రామాల్లో రాత్రి వరకు ఓటర్లు వేచి చూడాల్సి వచ్చింది. రాత్రి సమయం ఒక్కసారిగా ఉరుములు, మె రుపులతో వర్షం పడడంతో ఓటర్ల కోసం కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు నెలకొరగడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజక వర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, తన తనయుడు అభినవ్‌రెడ్డితో కలసి తిమ్మారెడ్డిపల్లి పోలింగ్ కేంద్రంలో ఉన్నాడు. విషయం తెలుసుకొన్న టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు కార్యకర్తలతో అక్కడకు చేరుకొని ఇరువురు బయటకు పంపిచాలంటూ పోలీసులను డిమాండ్ చేశారు. వర్షం కురున్నా రోడ్డుపై బైఠాయిస్తామని హెచ్చరించడంతో మేకపాటి బయటకు వచ్చేవరకు అక్కడే వేచి ఉండడంతో చేసేదేమిలేక ఇరువురిని అధికారులు బయటకు పంపించారు.

ఉదయం 6 గంటలకే తరలివచ్చిన ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకున్న బొల్లినేని

కలిగిరి : మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. వృద్ధులను కుటుంబ సభ్యులు తీసుకొచ్చి ఓటు వేయించారు. యువతీ యువకులు పోటీపడి తొలిసారిగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని కేంద్రాల్లో అధికారుల అలసత్వంతో పోలింగ్ ప్రారంభం ఆలస్యమైనప్పటికీ ఎలాంటి వివాదాలకు తావులేకుండా పో లింగ్ జరిగింది. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మె ల్యే బొల్లినేని వెంకటరామారావు పెదకొండూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, వంటేరు వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ మేకపాటి శాంతకుమారి పోలింగ్‌సరళిని పరిశీలించారు.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

వెల్లువెత్తిన చైతన్యం

కొండాపురం : మండలంలోని 19 పంచాయతీల పరిధిలో ఓటర్లలో చైతన్యం పెరిగింది. కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోలింగ్ సరళిని ఎన్డీయే కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ పరిశీలించారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రీత్య హైదరాబాదు, విశాఖపట్నం, చైన్నై, విజయవాడ నగరాలకు వలస వెళ్లిన మండల వాసులు ఓటు వేసేందుకు బస్సులు, కార్లలో తరలివచ్చారు. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ 6 గంటల తర్వాత గొట్టిగుండాల, గుడవళ్లూరు, బీమవరప్పాడు గ్రామాలలో ఓటర్లు ఉండటంతో పోలింగ్ కొనసాగింది. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న వంటేరు

బారులు తీరిన..

జలదంకి : మండలంలో సార్వత్రి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఉదయం 7 గంటలకే పోలింగ్ బూతులవద్ద బారులు దీరారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సగం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించినా తర్వాత పనిచేయడంతో పోలింగ్ ముగిసింది.



కలువాయి: క్యూలో ఉన్న ఓటర్లు

కలువాయి: ఉదయం 7గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కు వనియోగించుకున్నారు. సాయంత్రం 6గంటల కు పోలింగ్ ముగిసే సమయానికి పెద్దఎత్తున ఓటర్లు క్యూ లో ఉండటంతో చింతలపాళెం, దాచూరు, కుల్లూరు, పెరం కొండ, బ్రాహ్మణపల్లి, వెదనపర్తిలో రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది.



వరికుంటపాడు : వర్షానికి కూలిన షామియానా

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్


కోవూరులో బారులు తీరిన ఓటర్లు


కోవూరు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


ముత్తుకూరు : పోలింగ్ కేంద్రంలో వైసీపీ ఏజెంట్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సోమిరెడ్డి


రాపూరు : వేపినాపిలో అధికారులను నిలదీస్తున్న కురుగొండ్ల

కోవూరు, మే 13: నియోజకవర్గ పరిధిలోని 324 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఎన్నికల పర్వం ప్రశాంతంగా ముగిసింది. అధికారులు ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. ప్రధాన పార్టీల నాయకులు, ఎన్నికల ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కోవూరు మండల పరిధిలో గ్రామాల్లో ఉదయాన్నే మహిళలు, వృద్ధులు, రైతులు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో ఎన్నికల సిబ్బంది ప్రక్రియను వేగవంతం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఓటర్లు 47శాతం మంది మధ్యాహ్నం ఒంటిగంట లోపు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం నుంచి 5 గంటలకు 73.59 శాతం పోలింగ్ జరిగింది. కోవూరు మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరిశీలించారు. ప్రశాంతంగా పోలింగ్ ముగియడంతో పోలీసు అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

●**కొడవలూరు:** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం మండలంలో 24 పంచాయతీలకు సంబంధించి 55 పోలింగ్‌స్టేషన్‌లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అన్ని పోలింగ్‌స్టేషన్లలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో పాత వంగల్లు, తాటికుల దిన్నె గ్రామాలలో ఇరువర్గాల మధ్య స్వల్ప తోపులాట జరగడంతో పోలీసులు చెదరగొట్టారు. మండలంలో నార్తు రాజుపాళెం, కొడవలూరు పోలింగ్ స్టేషన్లను ఆమె సందర్శించారు. అనంతరం పోలింగ్‌స్టేషన్ సమీపంలో ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. మాజీ శాసన సభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలం రెడ్డి దినేష్‌రెడ్డి నార్తురాజు పాళెంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 180వ పోలింగ్‌స్టేషనులో సుమారు అర్థగంట పాటు ఈవీఎం మొరాయించింది. చెదురు మదురు ఘటనలు మినహా ఎక్కడా ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటుచేశారు.

●**విడవలూరు:** సార్వత్రిక ఎన్నికలు మండలంలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 15 పంచాయతీలలో జరిగిన ఎన్నికల్లో సుమారు 41,88వేల మంది ఓటర్లు ఉండగా 33,776 ఓట్లు పోల్ అయినట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. సరాసరి 80.78శాతం నమోదు అయింది. మండలంలోని రామతీర్థం, రామచంద్రాపురం ఊటుకూరు పెద్దపాళెంలో ఈవీఎంలు మొరాయించటంతో పోలింగ్ మందకొడిగా సాగింది. ఉదయం 7 నుంచి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకు నేందుకు బూత్‌ల వద్ద బారులు తీరారు. 7 నుంచి 12 వరకు మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తదుపరి ఊపందుకుంది. కోవూరు ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊటుకూరు పెద్దపాళంలో రాత్రి 8గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

●**ఇందుకూరుపేట:** మండలంలో సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దాదాపు 85 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఒకటి రెండు చోట్ల చెదురు మదురు సంఘటనలు తప్ప ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి.

●**బుచ్చిరెడిపాళెం:** బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో గ్రామ పంచాయతీలలో కొన్నిచోట్ల ప్రశాంతంగా మరి కొన్ని చోట్ల గందరగోళ వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. మొదటగా జొన్నవాడ పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్థానిక సర్పంచును అసభ్య పదజాలంతో మాట్లాడడంతో స్థానిక ప్రజలు నిలదీశారు. తప్పు ఒప్పుకుని వెళ్ళిపోయారు. అనంతరం మినగల్లు పోలింగ్‌కేంద్రం వద్ద ఆ గ్రామ సర్పంచు బొర్రుపూజిత భర్తపైనా అదే తరహాలో ఎమ్మెల్యే ప్రసన్న దుర్భాషలాడాడు. నాగాయగుంట గ్రామంలో వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై రాళ్ళు కర్రలతో దాడి చేసి ఓ టీడీపీ నాయకుడి ఇంటిపై దాడి చేశారు. ఈదాడిలో ఇద్దరు మహిళలు, ఓ దళిత యువకుడు గాయపడ్డాడు. ఈ దాడులతో పోలింగ్ అధికారులు అరగంట పాటు పోలింగ్ కేంద్రం తలుపులు మూసివేశారు. సీఐ హైమారావు వెళ్ళి హెచ్చరికలు చేయడంతో సద్దుమణిగింది. అదేవిధంగా ఓట్లు వేసే క్రమంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య అక్కడక్కడా వాగ్వాదాలు తలెత్తాయి. ఘర్షణలపైన ఇరు పార్టీల నాయకులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదులు చేశారు.

దామరమడుగులో మొరాయించిన ఈవీఎంలు

దామరమడుగు గ్రామంలోని 73, 74 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం పరికరాలు మొరాయించాయి. కొద్దిసేపటి అనంతరం పోలింగ్ పునరుద్ధరించారు. ఎన్డీఏ ఉమ్మడి కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చి పట్టణంతోపాటు మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లను, ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎంపీ అభ్యర్థి వి. విజయసాయిరెడ్డి బుచ్చిలో పలు పోలింగ్‌కేంద్రాలు సందర్శించారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు, రిపోర్టులు, ఎన్నికల నిబంధనల ప్రకారం కౌంటింగ్ సెంటర్‌కు బందోబస్తు నడుమ తరలించారు.

● **ముత్తుకూరు :** ముత్తుకూరు మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులుతీరారు. మండలంలోని వల్లూరు, పంటపాలెం, నారికేళ్లపల్లి, బ్రహ్మదేవం పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఉదయం పోలింగ్ కొద్దిసేపు ఆగింది. దీంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఈవీఎంలను మార్చడంతో పోలింగ్ సజావుగా సాగింది. ముత్తుకూరు, కృష్ణపట్నం పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ నాయకుల అత్యుత్సాహంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ నాయకులు తిరుగుతుండడంతో టీడీపీ నాయకులు అడ్డుచెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాటలు చోటుచేసుకున్నాయి. పోలీసులు సర్దిచెప్పి ఇరువర్గాలను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపడంతో పరిస్థితి సద్దుమణిగింది. కాగా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరు, నారికేళపల్లి, పంటపాలెంలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ఓటర్ల తీర్పు స్పష్టం... విజయం మాదే : సోమిరెడ్డి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు తమ పట్ల చూపిన ఆదరణతో వైసీపీకి దడ పుట్టిందని, విజయం తమదేనని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులోని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం జరిగిన ఎన్నికల సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ అరాచక పాలనను అంతమొందించాలనే కసితో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి బారులు తీరారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస బందోబస్తుకు పోలీసులు లేకపోవడం శోచనీయమన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు దౌర్జన్యం చేసేందుకు ప్రయత్నించడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొందని, ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌ను అడ్డుకోవాలని కావాలనే గొడవలు పెట్టుకునేందుకు ప్రయత్నించారన్నారు. ఓటర్ల తీర్పు స్పష్టంగా కనిపిస్తోందని ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

●**వెంకటాచలం:** మండలంలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం రాత్రి 9 గంటల వరకు సాగింది. వెంకటాచలం, మరి కొన్ని చోట్ల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని చోట్ల ఈవీఎంలు కొంతసేపు మొరాయించాయి. కంటేపల్లిలో 210 పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడం వల్ల ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు ఎండ, ఉక్క పోతతో అస్వస్థతకు లోనయ్యారు. కసుమూరులో మధు అనే 60 ఏళ్ల వ్యక్తిని కుటుంబ సభ్యులు ఆక్సిజన్ సిలిండర్ సహాయంతో తీసుకువచ్చి ఓటు వేయించారు. ఉదయం సర్వేపల్లి నియోజకవర్గంలో మందకొడిగా సాగిన ఓటింగ్ సరళి మధ్యాహ్నానికి 42.20 శాతం నమోదైంది. సాయంత్రం 5 గంటలకు 72.90 శాతానికి దాటింది. మండలంలోని చవటపాళెంలో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ సాగింది. వెంకటాచలం, నిడిగుంటపాళెం, సర్వేపల్లి గ్రామాల్లో 9.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. మండలంలోని ఈదగాలి, వెంకటాచలం మరికొన్ని చోట్ల పోలింగ్ సరళిని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డిలు పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచేందుకు తరలించారు.

పలు చోట్ల ఘర్షణలు

ఎన్నికల సందర్భంగా సోమ వారం మండలంలోని అనికేపల్లి, గొలగమూడి, వెంకటాచలం, ఈద గాలి మరికొన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులపై వైసీపీ శ్రేణులు బహా బాహికి దిగారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లు వేసేందుకు క్యూలైన్లల్లో ఉన్న ఓటర్లను వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రలోభాలకు గురి చేస్తుండడంతో టీడీపీ నాయకులు వాగ్వివాదానికి దిగారు. దొడ్డరాజు పాళెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సండి సురేష్‌పై వైసీపీ శ్రేణులు దాడి చేయడంతో కాలు విరిగింది. వెంకటాచలంలో పలువు రు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు గాయాలయ్యాయి. బయట వ్యక్తులు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తు న్నారని టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో వివాదం చోటుచేసుకుంది. సాయంత్రం ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో తోపులాట జరిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను పోలింగ్ కేంద్రం నుండి దూరంగా పంపించి వేశారు. అనికేపల్లిలో క్యూలైన్‌లో ఉన్న ఓటర్ల వద్దకు వైసీపీ నాయకులు వెళ్లి వైసీపీకి ఓటు వేయాలని సూచిస్తుండడంతో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్‌తో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి వైసీపీ నాయకుల తీరుపై ఎన్నికల అధి కారులు, పోలీసులను ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఇద్దరు టీడీపీ కార్య కర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈదగాలి, గొలగమూడి, కందల పాడులో తోపులాటలు జరిగాయి. ఎగువమిట్ట, గూడ్లూరువారి పాళెం గ్రామాల్లో ఉద్రికత్త నెలకొంది. మండలంలోని ఏడు గ్రామాల్లో మిన హాయించి మిగిలిన చోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కొన్నిచోట్ల వైసీపీ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్దే ఈవీఎం నమునా బాక్స్‌లు, స్లిప్‌లు పడేసి ప్రచారాలు చేశారు.

అస్తవ్యస్తంగా పోలింగ్ నిర్వహణ

మనుబోలు: మండలంలో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సక్రమంగా లేదంటూ ఓటర్లు మండిపడ్డారు. మండలంలో 19 పంచాయతీల్లో 42 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించారు. చాలా గ్రామాల్లో ఈవిఎంలు సక్రమంగా పని చేయకపోవడంతో ఆలస్యంగా ప్రారంభించారు. ఈవిఎంల మొరాయింపు, పోలింగ్ సిబ్బంది పనితీరు సక్రమంగా లేకపోవడంతో సాయంత్రం 6గంటల తరువాత కూడా బద్దెవోలు, వెంకన్నపాళెం, పిడూరుపాళెం, మనుబోలు కేంద్రాల్లో ఓటర్లు క్యూలో ఉండడంతో పోలింగ్ రాత్రి 8వరకు కొనసాగింది. గంటలకొద్దీ వేచివుండాల్సి రావడంతో ఓటర్లు ఓటు వేయకుండానే వెనుదిరిగారు. మనుబోలులో 9 బూత్‌లు ఉన్న కేంద్రం వద్ద కేవలం ముగ్గురు పోలీసులను మాత్రమే ఏర్పాటు చేశారు. రాజకీయ నాయకులు ఏకంగా బూత్‌ల వద్దకే వచ్చి ప్రచారాలు చేసి, ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. తిరుపతి ఎంపీ వైసీపీ అభ్యర్థి గురుమూర్తి, సర్వేపల్లి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

● **పొదలకూరు :** మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుంచి ఓటింగ్ మందకొడిగా సాగడంతో ఓటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని డేగపూడి, మరుపూరు, పులికల్లు, లింగంపల్లి, తాటిపర్తి, చెన్నారెడ్డిపల్లిలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. చెన్నారెడ్డిపల్లిలో పోలింగ్ సమయం ముగిసిన 7గంటల తర్వాత కూడా కొంతమంది ఓట్లు వేయడానికి రావడంతో సిబ్బంది, పోలీసులు వారిని వేయడానికి వీలులేదని వెనక్కి పంపారు. నిర్ణీత సమయానికి క్యూలైన్‌లో ఉన్న వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. రాత్రి 9గంటలకు చెన్నారెడ్డిపల్లిలో పోలింగ్ జరిగింది.

● **రాపూరు(డక్కిలి):** రాపూరు పోలింగ్‌లో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. ఉదయం 7గంటల నుంచే అన్ని కేంద్రాల్లో ఓటర్లు బారులుతీరారు. పోలింగ్ ముగిసే సమయానికి 80శాతానికి మించి ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేపినాపి పోలింగ్ కేంద్రంలో వైసీపీ నాయకులు టీడీపీ ఏజెంట్లపై దౌర్జన్యానికి దిగి ఓట్లు వేసుకొన్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ఈ కేంద్రానికి చేరుకుని అధికారులను నిలదీశారు.

వెంకటగిరిలో గెలిచేది నేనే : కురుగొండ్ల

నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల పోలింగ్ సరళి బట్టి చూస్తే వెంకటగిరిలో గెలిచేది తానేనని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ధీమా వ్యక్తంచేశారు. వేపినాపి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు.

● **సైదాపురం:** మండలంలో మర్లపూడి, చాగణం, రామసాగరం గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో పోలీసులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కృష్ణారెడ్డిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడుతుంటే వెబ్ క్యాస్ట్ సిబ్బంది వీడియో తీయడంతో తమిళనాడుకు చెందిన వెబ్‌క్యాస్ట్ సిబ్బందిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి వీడియోను తొలగించారు. చాగణం, రామసాగరం పంచాయతీల్లో రాత్రి 8గంటల వరకు వరకు పోలింగ్ కొనసాగింది.


బుచ్చిరెడిపాళెం: పెనుబల్లిలో బారులు తీరిన ఓటర్లు


మనుబోలు : క్యూలో నిలిచిన ఓటర్లు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభంకాగా నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల్లో ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు క్యూ కట్టారు. సాయంత్రం 6 గంటలకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు హక్కును వినియోగించుకునే అకాశం అధికారులు కల్పించారు. ఆ సమయానికి పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ స్టేషన్ల వద్ద బారులు తీరి ఉన్నారు. దీంతో పలు కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకు, కొన్నిచోట్ల 10 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా ఓటర్లు తరలి వచ్చి వారి హక్కును వినియోగించుకున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా, ఈవీఎంలు మొరాయించిన ఓపికగా క్యూలైన్లలో వేచి ఉండి మరీ ఓటు వేశారు. ఈ పరిణామంతో గతంలో కన్నా ఈ దఫా పోలింగ్ శాతం బాగా పెరిగింది. మొత్తంగా ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ పూర్తయ్యాక ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంలకు సీల్ వేసిన సిబ్బంది, కట్టుదిట్టమైన భద్రతతో ఓటింగ్ యంత్రాలను ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు చేర్చారు.


బుజబుజనెల్లూరులో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా బారులు తీరిన ఓటర్లు

పోటెత్తిన ఓటర్లు

- ఉదయం 6 గంటలకే బారులు తీరిన జనం
- సాయంత్రం 6 దాటినా తగ్గని క్యూలైన్లు
- పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు
- ఆలస్యమైనా ఓపిగ్గా నిలబడి ఓటేశారు
- మొత్తంగా పోలింగ్ ప్రశాంతం
- స్ట్రాంగ్ రూంకు చేరిన ఈవీఎంలు

రూరల్లో ఈవీఎంల మొరాయింపు

● వైసీపీ శ్రేణులు యథేచ్ఛగా ప్రచారం

నెల్లూరు రూరల్, మే 13 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయితే చాలా చోట్ల ఈవీఎం, వీవీ ప్యాట్లు పనిచేయకపోవడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లో నిలబడాల్సి వచ్చింది. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లలోపు ఎన్నికల సంఘం ఆంక్షలు అమలులో ఉన్నప్పటికీ పలుచోట్ల వైసీపీ నాయకులు యథేచ్ఛగా ప్రచారం చేశారు. ఇదంతా కనిపిస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో కొంత సమయానికి ఓటర్లే ప్రశ్నించడం గమనార్హం. 2014 ఎన్నికల్లో 60.14 శాతం, 2019 ఎన్నికల్లో 66.14 శాతం పోలింగ్ నమోదుకాగా ఈసారి 61.18 శాతం నమోదైంది.

● పెద్దచెరుకూరులోని 255 నెంబరు బూత్‌లో ఉదయం 7.40 గంటలకు పోలింగ్ మొదలుకాగా 27 ఓట్లు పోలైన తర్వాత ఈవీఎం మొరాయించడంతో ఓటింగ్ నిలిచిపోయింది. మరమ్మతులు చేసి మళ్లీ ప్రారంభించగా మరో 7 ఓట్లు పోలైన అనంతరం వీవీప్యాట్ మొరాయించింది. 9 గంటలకు మరో వీవీప్యాట్ అమర్చి పోలింగ్ కొనసాగించారు. సాయంత్రం 6 గంటలకు మళ్లీ మొరాయించింది. అప్పటికి క్యూలైన్లో ఓటర్లు బారులు తీరి ఉన్నారు. ఓ మహిళ సొమ్మసిల్లిపడిపోవడంతో వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు.

● ధనలక్ష్మీపురం, సౌత్‌మోపూరు, గొల్లకందుకూరు గ్రామాల్లోనూ ఈవీఎంలు మొరాయించాయి. బుజబుజ నెల్లూరు, గుడిపల్లిపాడు ప్రాంతాల్లో వీవీప్యాట్లు పనిచేయలేదు. ఆ మంచర్లలో ఓటు నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగడంతో ఓటర్లు గంటలతరబడి వేచి ఉండాల్సి వచ్చింది. దీనికితోడు షామియానాలు, తాగునీరు, కుర్చీలు వంటి సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపించాయి.

● పెద్దచెరుకూరులోని పోలింగ్ స్టేషన్ వద్ద బూత్ లోపలే వైసీపీకి చెందిన వ్యక్తి ఆదాలకు ఓటెయ్యాలని సూచించడంతో అభ్యంతరం వ్యక్తం చేసిన మహిళా ఓటరు అతనిపై తిరగబడింది. ఇలా బూత్‌లోనే ప్రచారం చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

క్రాస్ ఓటింగ్ వైసీపీ కొంప ముంచేనా?

ముస్లింలు, క్రైస్తవుల ఓట్లన్నీ తమకేనంటూ ధీమా వ్యక్తం చేసిన వైసీపీకి నెల్లూరు రూరల్ ఓటర్లు షాకిచ్చినట్లు సీనియర్లు విశ్లేషిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగిందని అంచనా వేస్తున్నారు. దీనికితోడు టీడీపీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇద్దరికీ ఓటింగ్ మిషన్‌లో రెండో నెంబరే రావడం వారికి కలిసొచ్చిందనే వాదన వినిపిస్తోంది. బీజేపీ వ్యతిరేక ఓటు తమకేనని వైసీపీ వర్గాలు భావించినా రూరల్ ఓటర్లు సైకిల్ వైపే మొగ్గు చూపారనే ప్రచారం జరుగుతోంది.

ఎస్పీ నిరంతర పర్యవేక్షణ

నెల్లూరు(క్రైం), మే 13: పోలింగ్‌ను ఎస్పీ కే ఆరిఫ్ హఫీజ్ నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉన్నారు. జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎం మిషన్లు స్ట్రాంగ్ రూమ్‌కు చేరేంత వరకు పోలీసులు నిరంతర బందోబస్తు నిర్వహించారు.

టీడీపీ, వైసీపీ నాయకుల వాగ్వాదం

నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని పొదలకూరు రోడ్డు జడ్పీ హైస్కూల్ పోలింగ్ బూత్ లో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ స్కూల్లో 28వ డివిజన్‌కు సంబంధించి 141 నుంచి 144 వరకు పోలింగ్ బూత్‌లున్నాయి. వాటిని వైసీపీ తరపున మదన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ తరపున చక్కా సాయిసునీల్ పర్యవేక్షిస్తున్నారు. సాయంత్రం 4.30గంటల సమయంలో మదన్‌మోహన్‌రెడ్డి కుర్చీ వేసుకుని కూర్చుని తమ పార్టీకి ఓటు వేయమని ఓటర్లకు విజ్ఞప్తి చేయసాగారు. చక్కా సాయిసునీల్ తాను కూడా కుర్చీ వేసుకుని ఓటర్లను అభ్యర్థించసాగారు. కొంతసేపటి తర్వాత మదన్‌మోహన్‌రెడ్డి పోలింగ్ బూత్‌లోకి వెళ్లగా సాయిసునీల్ అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు గుమికూడటంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని రెండు వర్గాలను చెదరగొట్టారు.

బోసిపోయిన నగరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలందరూ సొంతూర్లకు వెళ్లడం, పోలింగ్ నేపథ్యంలో పల్లెల నుంచి రోజువారీ పనుల నిమిత్తం గ్రామీణులు ఎవరూ నగరానికి రాకపోవడంతో నెల్లూరు సిటీ సోమవారం బోసిపోయింది. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే స్టోన్‌హౌస్‌పేట, ట్రంకురోడ్డు, చిన్నబజారు, పెద్దబజారు, కాపువీధి, గాంధీబొమ్మ కూడలి తదితర ప్రాంతాల్లో దుకాణాలు, హోటళ్లు, టిఫెన్ సెంటర్లను సైతం యజమానులు తెరవకపోవడంతో సిటీలో సందడి కరువైంది.

నగరంలో చైతన్యం... పెరిగిన ఓటింగ్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 13 : నగర నియోజకవర్గం పరిధిలోని 28 డివిజన్లలో గతంలో ఎన్నడూ లేనంతగా ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఈ నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో 57.01శాతం, 2019 ఎన్నికల్లో 66 శాతం పోలింగ్ నమోదుకాగా ప్రస్తుత ఎన్నికల్లో 70.20 శాతం నమోదు అయింది. నెల్లూరు నగర పరిధిలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఈవీఎంలు మొరాయించాయి. వెంకటేశ్వరపురంలోని 8, 14, 16 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పనిచేయకపోవడంతో ఉదయం 8గంటలకు కూడా పోలింగ్ ప్రారంభం కాని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. మాజీ మంత్రి, నెల్లూరు సిటీ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ మూలాపేటలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ సరళిని, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీ, రంగనాయకులపేట, జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు.



ఓటెత్తిన యువత

నెల్లూరు (విద్య), మే 13 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల్లో యువత పోటెత్తింది. కొత్తగా ఓటు హక్కు పొందిన వారు తొలిసారి దానిని వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని వెంకటరెడ్డినగర్, గాంధీనగర్, ఆటోనగర్, బుజబుజ నెల్లూరు, భక్తవత్సల నగర్, పొదలకూరు రోడ్డు, ఏసీ స్టేడియం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తును ఓటర్లు క్యూ కట్టారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి బుజబుజ నెల్లూరులోని 66, 67వ నెంబర్ బూత్‌లలో వందల సంఖ్యలో ఓటర్లు బార్లు తీరడంతో అధికారులు పోలింగ్ కొనసాగింపునకు ఏర్పాట్లు చేశారు. 66వ బూత్‌లో రాత్రి 8 గంటల వరకు, 67వ బూత్‌లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.

ఓటరు జాబితాలో పేర్లు లేవని నిరసన...

బుజబుజనెల్లూరు, వేదాయపాళెం, అయ్యప్పగుడి తదితర ప్రాంతాల్లోని పలు వార్డుల్లో ఓటర్ లిస్టుల్లో తమ పేర్లు లేవని పలువురు నిరసన వ్యక్తం చేశారు. తాము ఇప్పటికే పలుమార్లు ఓటు హక్కును వినియోగించుకున్నామని, తమ వద్ద ఓటరు కార్డులు ఉన్నా కూడా లిస్టులో మాత్రం పేర్లు లేకపోవడం అధికారుల తప్పిదమేనని ఆరోపించారు. కొంత మంది వారి వద్ద ఉన్న పాత గుర్తింపు కార్డులు చూపి చాలెంజింగ్ ఓటుకు అనుమతివ్వాలని అధికారులను డిమాండ్ చేశారు. అయితే లిస్ట్‌లో పేరు లేకుంటే తామేమీ చేయలేమని, అధికారులు తేల్చి చెప్పారు. బుజబుజ నెల్లూరులోని 58, 59, 67 నెంబర్ పోలింగ్ బూత్‌ల వద్ద అధికార వైసీపీ నేతలు పెద్ద ఎత్తున గుమికూడటంతో వారికి పోటీగా తెలుగుదేశం పార్టీ నేతలు కూడా అక్కడకు చేరుకున్నారు. ఒకానొకదశలో ఇరువురి నడుమ తీవ్ర స్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పి పంపేశారు.

పోలింగ్ పదనిసలు

- రూరల్ నియోజకవర్గంలోని 32, 33, 34 డివిజన్లలో పోలింగ్ జరుగుతుండగానే ఓటర్లు యథేచ్ఛగా డబ్బు పంచారు.
- కొందరు ఓటర్లు ఒక ఓటు అధికార పార్టీకి, మరొక ఓటు ఎన్డీఏ కూటమికి వేసి ఇద్దరికీ న్యాయం చేసినట్లు చర్చించుకున్నారు. ఈ పరిణామం అధికారపార్టీ ఎంపీ అభ్యర్థికి నష్టం కలిగిస్తుందని అంచనా.
- 30, 31, 32, 33, 34 డివిజన్లలో అధికార పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయించేందుకు వలంటర్లు చొరవ చూపారు.
- కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని ముస్లింలకు వారి మత పెద్దల పేరున వాట్సప్ మెసేజ్‌లు రావడంతో గెలవని పార్టీకి ఓటు వేశామని ముస్లింలు కొందరు బహిరంగంగా వాపోయారు.
- మూలాపేట వేదసంస్కృత పాఠశాలలో 8 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడికి భారీగా ఓటర్లు తరలిరావడంతో పాఠశాల ఆవరణ కిటకిటలాడింది.
- పలు పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ సరళిని టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులు నారాయణ, కోటంరెడ్డి, పలువురు టీడీపీ నేతలు పరిశీలించారు.
- నగర నియోజకవర్గంలోని ఆర్ఎస్ఆర్ పాఠశాల, బీవీఎస్, పత్తివారి పాఠశాల... ఇలా అనేక పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7.30 గంటలకు పోలింగ్‌ను ప్రారంభించారు. ట్రైల్ రన్ నిర్వహించడం ఆలస్యం కావడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభం అయ్యింది.
- గంటల తరబడి పోలింగ్ కేంద్రంలో ఎదురు చూస్తున్నామని, ఎండ తీవ్రత వల్ల నీరసం వస్తోందని, త్వరగా ప్రక్రియను కొనసాగించాలంటూ ఆర్ఎస్ఆర్ పాఠశాలలో ఓటర్లు నగర మున్సిపల్ కమిషనర్ వికాస్‌ను నిలదీశారు.
- పలు కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్‌చైర్లు పనిచేయక పోవడంతో నడవలేని వారు ఇబ్బందిపడ్డారు.
- పోలింగ్ కేంద్రాల వద్ద పార్కింగ్ సమస్యతో ఓటర్లు అసౌకర్యానికి గురయ్యారు.
- పలు పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు తక్కువగా ఉండటంతో అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు ఇష్టానుసారంగా వ్యవహరించారు.

\- నెల్లూరు (సాంస్కృతికం/స్టోన్‌హౌస్‌పేట)

సీబీఎస్ఈ ఫలితాల్లో ఓవెల్‌కు ఉత్తమ మార్కులు

నెల్లూరు (విద్య), మే 13 : సీబీఎస్ఈ ఫలితాల్లో కొడవలూరు మండలంలోని ఓవెల్ 18 సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ ఆర్ వేణు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన కొమరా గీతిక 500 మార్కులకు 463 మార్కులు సాధించి టాప్‌లో నిలిచిందన్నారు. 13 మంది విద్యార్థులు 400కుపైగా మార్కులు సాధించారని, 51 మంది ప్రథమ శ్రేణి, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. మున్ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రమీల, ఈడీ బాలు, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం నవీన్, ప్రిన్సిపాల్ వీ వంశీకృష్ణ పాల్గొన్నారు.


విజయ చిహ్నం చూపుతున్న విద్యార్థులు

కనుల పండువగా కిరాతార్జునీయం అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), మే 13 : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, పుష్పాలంకరణ జరిగాయి. సాయంత్రం జరిగిన కిరాతార్జునీయం అలంకారం భక్తులకు నేత్రానందం కలిగించింది. ధర్మకర్తలు, ఈవో వేణుగోపాల్ పర్యవేక్షించారు.



గూడూరు గిరిజన బాలికల పాఠశాలలోని పోలింగు కేంద్రం వద్ద క్యూలైన్లో ఓటర్లు



ఓటోత్సాహం

పోలింగ్ 76.83 శాతం

తిరుమలలో ఓటేసిన యువతులు

తిరుపతిలోని దొడ్డాపురం వీధిలో దొంగ ఓటర్ల పరిస్థితి

ఓటోత్సాహం వెల్లివిరిసింది. తెల్లవారేసరికే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి మున్నెన్నడూ లేని చైతన్యాన్ని చాటుకున్నారు. గేట్లు తెరవకముందే చేరుకుని క్యూలైన్‌లో బారులు తీరారు.ఎండ, ఉక్కపోతలను బేఖాతరు చేశారు. ఈవీఎంలు మొరాయించినా గంటల కొద్దీ సహనంగా నిరీక్షించారు.నిబంధనల మేరకు సాయంత్రం 6గంటలకు క్యూలో ఉన్న ఓటర్లు రాత్రి 12 గంటల తర్వాత కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

స్థానం	రాత్రి 10.30
గూడూరు	74.37
సూళ్లూరుపేట	80.69
వెంకటగిరి	80.03
చంద్రగిరి	79.34
తిరుపతి	59.95
శ్రీకాళహస్తి	83.00
సత్యవేడు	84.28
జిల్లా మొత్తం	76.83

(పోలింగ్ శాతం)



ఏర్పేడు మండలం మడిబాకలో తల్లిని ఓటింగుకు తీసుకెళుతున్న యువకుడు

చెదురుమదురు ఘటనలు

- రేణిగుంట మండలం కరకంబాడి 131వ బూత్ వద్ద ప్రచారం చేస్తున్న వైసీపీ వారిని టీడీపీ వారు వారించడంతో వైసీపీ ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి వర్గీయులు దౌర్జన్యం చేశారు.
- చిల్లకూరులో 114, 115 నంబర్ల బూత్‌ల వద్ద ఎక్కడ వుండాలనే దానిపై టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాం తలెత్తింది. ఇరువర్గాల నడుమా స్వల్ప తోపులాట జరిగింది. అదే సమయంలో అక్కడికి చేరుకున్న టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌ను, నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అరగంట పాటు పోలింగ్ ఆగిపోయింది.
- డక్కిలి మండలం అల్తూరుపాడులో ఓ కానిస్టేబుల్ వైసీపీ నాయకులకు మద్దతుగా పని చేస్తున్నాడని టీడీపీ నాయకులు గొడవకు దిగారు.
- పెళ్ళకూరు మండలం రావులపాడు బూత్ వద్ద వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది.
- నాయుడుపేట మండలం మేనకూరు 101, 102 నంబర్ల బూత్‌ల వద్ద వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ తోపులాట జరిగింది.

తిరుపతి, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో ఒకటి రెండు చోట్ల టీడీపీ, వైసీపీ వర్గీయుల నడుమ జరిగిన ఘర్షణలు పోలీసు కాల్పులకు, లాఠీచార్జీలకు దారితీసి ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. వీటితో పాటు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగానే పోలింగ్ ముగిసింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంట నుంచీ గంట పాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.



ఎ.రంగంపేటలో ఓటేసిన మోహన్‌బాబు, విష్ణు



పోలింగు ముగించుకుని స్ట్రాంగ్‌రూముకు బయల్దేరిన సిబ్బంది

తిరుపతిలోని సత్యనారాయణపురం జడ్పీ స్కూల్ వద్ద ఓటర్ల క్యూలైన్

బ్రాహ్మణ కాల్వలో ఉద్రిక్తత:గాల్లోకి కాల్పులు

రామచంద్రాపురం/తిరుచానూరు, మే 13 : రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాల్వ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం వైసీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య వివాదం చెలరేగి ఘర్షణలకు దారి తీసింది. కళ్ళు సరిగా కనిపించని ఓటరు వెంట సహాయకుడు బూత్‌లోకి వెళ్ళడానికి వైసీపీ ఏజెంట్ అభ్యంతరం చెప్పారు. ఇరుపార్టీల ఏజెంట్ల నడుమా మాటామాటా పెరిగింది. టీడీపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న మాజీ సర్పంచ్‌పై వైసీపీ వర్గీయులు దాడి చేసి కొట్టారు. ఘర్షణలో బూత్ లోపల ఫర్నిచర్ కూడా ధ్వంసమైంది. ఆ గ్రామం టీడీపీకి కంచుకోట కావడం, మాజీ సర్పంచ్‌ను వైసీపీ వారు కొట్టడంతో గ్రామస్తులు కోపోద్రిక్తులయ్యారు. అందరూ ఏకమై పోలింగ్ బూత్ వద్ద మొహరించారు. బూత్‌లోకి దూసుకెళ్ళేందుకు యత్నించగా అక్కడే వున్న బీఎస్ఎఫ్ జవాన్ నాలుగు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు.



సమాచారమందుకుని వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భారీ ఎత్తున అనుచరులతో గ్రామానికి చేరుకుని పోలింగ్ బూత్‌లోకి వెళ్ళి టీడీపీ ఏజంట్లపై దౌర్జన్యం చేశారు. పోలీసులు ఆయన్ను వెలుపలికి తీసుకు రాగా తమ ఏజంట్లపై దాడి చేసిన వారెవరో బయటికి రండిరా తేల్చుకుందాం అంటూ సవాళ్ళు విసిరారు. ఆయన అనుచరులు భారీగా వుండడం, మరోవైపు గ్రామస్తులు మూకుమ్మడిగా మొహరించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో మొబైల్ ఫోన్‌లో వీడియో తీస్తున్న ఆంధ్రజ్యోతి విలేకరి రాజును ఎవడ్రా నువ్వు అంటూ దౌర్జన్యం చేశారు. చేతిలోవున్న మొబైల్ ఫోన్ లాక్కుని దాడికి యత్నించారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి అందరినీ చెదరగొట్టారు. సాయంత్రం 6 గంటల తర్వాత మళ్ళీ గ్రామానికి వస్తానని, అందరి కథా తేలుస్తానని హెచ్చరికలు జారీ చేసి మోహిత్‌రెడ్డి వెనుదిరిగారు. తర్వాత కొద్దిసేపటికి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ అక్కడకు చేరుకుని పార్టీ ఏజెంట్లను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, సంయమనం పాటించాలని గ్రామస్తులను శాంతపరిచారు.ఈఆర్వో నిశాంత్‌రెడ్డి కూడా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని, సాక్ష్యాధారాలతో ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు చేరుకోవడంతో ఉద్రిక్తత సడలింది. కాగా ఈ వివాదంతో మధ్యాహ్నం 1 గంట నుంచీ 3 గంటల వరకూ రెండు గంటల పాటు పోలింగ్ ఆగిపోయింది.ఈ ఘటనపై కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ విచారణకు ఆదేశించారు.సొరకాయలపేట పోలింగ్ కేంద్రంలో వైసీపీ ఏజెంట్ ఫ్యాన్ సింబల్‌తో ప్రచారం చేస్తుండగా టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు.



పలుచోట్ల లాఠీఛార్జి

నాయుడుపేట టౌన్, మే 13: నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో పోలింగు బూత్ వద్ద వైసీపీ వర్గీయుడు తిరుగుతుండగా ప్రత్యర్థులు అభ్యంతరం తెలిపారు.దీంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల నడుమ వివాదం చోటుచేసుకుని పరస్పరం తోపులాటకు దిగారు. ఘర్షణ తలెత్తే పరిస్థితులుండడంతో విధుల్లో వున్న ఎస్ఐ గోపీనాథ్ సిబ్బందితో కలసి లాఠీఛార్జి చేశారు.సమీపంలో ఉన్న ఓ ఇంటిలోకి ముగ్గురు వ్యక్తులు పరిగెత్తారు. ఎస్ఐ లాఠీతో వారిని తరిమేక్రమంలో ఆ ఇంటిముందు కూచున్న వృద్ధురాలు జులేఖాబీ (70) తలపై లాఠీ తగిలింది. దీంతో రక్తస్రావం జరిగి వృద్దురాలు ఆమె తీవ్రంగా గాయపడింది. గ్రామస్తులు ఆమెను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వరదయ్యపాలెం మండలం కువ్వాకొల్లులో పోలింగ్ బూత్‌కు వంద మీటర్ల దూరంలో టీడీపీ వర్గీయులు వేసుకున్న శిబిరాన్ని ఎస్ఐ ప్రతాప్ ధ్వంసం చేసినంత పనిచేశారు. ప్రశ్నించిన టీడీపీ వర్గీయులపై లాఠీ ఝులిపించి వీరంగం చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు, టీడీపీ వర్గీయులు పోలీసు వాహనాన్ని అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఏర్పేడు మండలం కోబాకలో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులు క్యూలైన్ సమీపానికి వెళ్ళి ఓటర్లను మద్దతు కోరుతుండగా టీడీపీ వర్గీయులు అభ్యంతరపెట్టారు. దీంతో ఇరువర్గాలూ వాగ్వాదానికి దిగడంతో ఘర్షణలు జరగకుండా పోలీసులు చెదరగొట్టారు.

ఎస్ఐ ఓవరాక్షన్‌తో టీడీపీ అభ్యర్థి సహా నేతలకు గాయాలు

చిల్లకూరు, మే 13: ఓ పోలింగ్‌బూత్‌లో ఇరుపార్టీల మధ్య చోటుచేసుకున్న చిన్నవివాదం కారణంగా ఎమ్మెల్యే అభ్యరి పాశం సునీల్‌కుమార్, మరో ముగ్గురు టీడీపీ నేతలకు గాయాలయ్యాయి.చిల్లకూరులోని 114, 115 పోలింగ్ బూత్‌ల ఆవరణలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలావున్నాయి. వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ 10మంది నాయకులతో కలిసి గుంపుగా పోలింగ్ బూత్‌లోకి వెళుతుండగా అక్కడే ఉన్న టీడీపీ నాయకుడు కొండా రామచంద్రారెడ్డి అభ్యంతరం తెలిపారు. దీంతో మేరిగ మురళీధర్, గూడూరు మండలం మంగళపూరుకు చెందిన ఎద్దల నరేంద్రరెడ్డి ఆయనతో వాగ్వాదానికి దిగారు. అంతలో వైసీపీ నేత నరేంద్రరెడ్డి టీడీపీ నేత రామచంద్రారెడ్డిపై చేయి చేసుకుంటుండగా ఎస్ఐ అంజిరెడ్డి కూడా అత్యుత్సాహం ప్రదర్శించారు. టీడీపీ నేత కొండా రామచంద్రారెడ్డిపై ,పక్కనే వున్న మహిళానేత మద్దాలి విజయ, వెంకటరాఘయ్యలపై లాఠీ ఝుళిపించారు. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకుని సంఘటనాస్థలానికి వచ్చిన టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్ ఎందుకు తమ వారిని కొడుతున్నారని ప్రశ్నించగా కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరువర్గాల తోపులాటలో సునీల్‌కుమార్ చేతికి కూడా గాయమైంది. చిన్నవివాదం కాస్తా ఎస్ఐ అంజిరెడ్డి అత్యుత్సాహంతో పెద్దదైంది. గాయపడ్డ టీడీపీ నాయకులను చికిత్సనిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి పార్టీ వర్గాలు తరలించారు.



గాయపడ్డ సునీల్‌కుమార్



గాయపడ్డ విజయ



కమ్మవారిపాలెం గ్రామస్తుల నిరసన

రెండు చోట్ల పోలింగ్ బహిష్కరణ

నాయుడుపేట టౌన్, మే 13: నాయుడుపేట మండలం కమ్మవారిపాలెంలో గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. తమ గ్రామానికి కనీస సదుపాయాలు కూడా లేవని, వాటిని కల్పించే వరకూ ఓటు వేసేది లేదని పోలింగ్‌ను బహిష్కరించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్‌లో పాల్గొనలేదు.చివరకు టీడీపీ నేతల హామీతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. కేవీబీపురం మండలం పాతపాలెం పంచాయతీ కేసీ కండ్రిగలో సైతం మౌలిక సదుపాయాలు లేవని ఆరోపిస్తూ పోలింగ్‌ను గ్రామస్తులు బహిష్కరించారు. చివరకు అధికారులు సర్ది చెప్పడంతో ఓటింగులో పాల్గొన్నారు.

చెరివిలో ఓటర్లకు విద్యుత్ షాక్

సత్యవేడు మండలం చెరివి గ్రామంలో ఎన్నికల పోలింగ్ కేంద్రం ఓ రేకుల షెడ్‌లో ఏర్పాటు చేశారు. పోలింగ్ జరుగుతుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి బూత్‌లోని వారంతా షాక్‌కు గురయ్యారు. ఒక ఓటరు స్వల్పంగా గాయపడ్డారు.

తుమ్మలగుంటలో ఉద్రిక్తత

తిరుపతి రూరల్/పాకాల, మే 13: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంట హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగిశాక కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ ముగిసిన తర్వాత టీడీపీ ఏజెంట్‌గా వ్యవహరించిన దొడ్ల కరుణాకర్‌రెడ్డి పోలింగ్ బూత్ నుంచి వెలుపలకు వచ్చారు. అప్పటికే పోలింగ్ బూత్ కేంద్రం గేట్ వద్ద ఉన్న చెవిరెడ్డి సోదరుడు రఘు టీడీపీ అనుకూలంగా ఓట్లు వేయిస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహంతో దొడ్లపైకి దూసుకొచ్చాడు. మాటల యుద్ధానికి దిగి.. ఒకరిపై ఒకరు దాడి చేసుకోబోయే క్రమంలో భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. రఘును బయటికి పంపి, కరుణాకర్‌రెడ్డిని తిరిగి బూత్‌లోకి పంపారు. కొద్ది నిమిషాల్లోనే రఘుతోపాటు చెవిరెడ్డి అనుచరులు భారీగా పోగయ్యారు. దొడ్ల బయటకి వస్తే దాడి చేయాలని నిలబడ్డారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని సొంతగ్రామమైన పులివర్తివారిపల్లెకి వెళ్లిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని నాని అనుచరులు అనుచరులు అడ్డుకున్నారని, మోహిత్‌కు ఏదైనా అయితే తుమ్మలగుంట నుంచి ఈవీఎంలు ఎలా బయటకి వెళతాయో చూస్తామంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. పోలీసులు టీడీపీకే అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈవీఎంల ప్రస్తావన తీసుకురాగానే భద్రతా సిబ్బంది అప్రమత్తమై అదనపు బందోబస్తును సమకూర్చుకున్నారు. భారీగా లాఠీలు, ఆయుధాలతో పోలింగ్ కేంద్రం ముందు మొహరించడంతో ఆప్రదేశమంతా భయానకంగా మారింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే దొడ్లను పోలీసులు ముందు జాగ్రత్తగా అదుపులోకి తీసుకుని అక్కడ తీసుకెళ్లిపోయారు. మరోవైపు సీఐ అహ్మద్ స్పందిస్తూ.. మోహిత్ సురక్షితంగానే ఉన్నారని, కొద్దినిమిషాల్లో తుమ్మలగుంటకు చేరుకుంటారని తెలియజేసి, రఘుతోపాటు అక్కడున్న చెవిరెడ్డి అనుచరులను పోలింగ్ కేంద్రం నుంచి దూరంగా పంపేశారు. అయినప్పటికీ గ్రామస్తుల చేతుల్లో కర్రలు, రాళ్లు ఉండటంతో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను బస్సుల్లో ఎక్కించి పంపారు. దాంతో రాత్రి 8 గంటల తర్వాత తుమ్మలగుంటలో ప్రశాంత వాతావరణం నెలకొంది.

పులివర్తివారిపల్లెలో ఏం జరిగిందంటే..

పాకాల మండలం పులివర్తివారిపల్లెలో పోలింగ్ పూర్తయ్యాక వైసీపీ ఏజెంట్‌గా ఉన్న అనిల్ అనే వ్యక్తిపై దాడి జరిగిందన్న సమాచారంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వచ్చారు. దాంతో మండపంలోని వైసీపీ కార్యకర్తలందరూ అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో టీడీపీ, వైసీపీ శ్రేణులు ఒకరిపై ఒకరు మాటల యుద్ధం చేసుకున్నారు. వెంటనే అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు చేరుకుని, ఇరువర్గాలను పోలింగ్ కేంద్రం వద్ద నుంచి పంపేశారు.

అంబేడ్కర్‌కు అపచారం



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగిన దళిత సంఘాలు

వెంకటగిరి/డక్కిలి, మే 13 : వెంకటగిరి పట్టణ నడిబొడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం తలనరికి దూరంగా విసిరేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. వెంకటగిరి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఆనుకొని వున్న విగ్రహం తలనరికి దూ రంగా పడేసి ఉన్న విషయాన్ని సోమవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకొన్న దళిత సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి.ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఈ దారుణానికి ఒడిగట్టిందెవరన్న విషయం తేలలేదు.దీనిపై మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టాలని దళిత సంఘాల నేతలు నిర్ణయించాయి.

పోటెత్తిన ఓటరు

కొద్దిసేపు మొరాయించిన ఈవీఎంలు ● చిల్లకూరులో టీడీపీ నేతలపై దాడి ● ఇద్దరికి గాయాలు ● టీడీపీ అభ్యర్థి సునీల్ చేతికి గాయం






గూడూరులో పట్టణంలోని పోలింగ్ కేంద్రం, చెన్నూరు గ్రామంలో ఓటు వేసేందుకు క్యూలైన్లలో ఓటర్లు - మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకున్న యువతి







ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్, ఎంపీ వరప్రసాద రావు కుటుంబీకులు, పాశం సంధ్యారాణి, వైసీపీ అభ్యర్థి మురళీధర్, ఆర్వో కిరణ్‌కుమార్

గూడూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గూడూరు శాసనసభ, తిరుపతి లోక్‌సభకు సోమవారం జరిగిన ఎన్నికలు చెదురు మదురు ఘటనలు మినహా సాఫీగా సాగాయి. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు పోటెత్తారు. రాత్రి 10.30 గంటల సమయానికి నియోజకవర్గ పరిధిలో 76.30 శాతం నమోదైంది. భారీగా పోలింగ్ నమోదు కావడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు విస్పష్టంగా బహిర్గతమైనట్టు చర్చించుకుంటున్నారు. పోలింగ్ ప్రారంభంలో గూడూరు మండలంలోని తుంగపాళెం, పగడాలపల్లి, పట్టణంలోని మాళవ్యానగర్, గాంధీనగర్ మరికొన్ని చోట్ల ఈవీఎంలు తొలుత మొరాయించడంతో అధికార యంత్రాంగంలో ఆందోళన నెలకొంది. అరగంట తరువాత పని చేయడంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే తుంగపాళెంలో ఈవీఎంని మార్చారు. నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. ఓటింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీగా మొహరించారు.

● నియోజకవర్గంలో చిల్లకూరులో టీడీపీ నాయకుడు రామచంద్రారెడ్డి తదితరులపై వైసీపీ మూకలు దాడి చేయడంతోపాటు ఎస్ఐ అంజిరెడ్డి ఓవర్‌యాక్షన్ చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ అభ్యర్థి సునీల్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రశ్నించడంతో తోపులాట జరిగింది. ఈ ఘటనలో సునీల్ చేతికి స్వల్ప గాయమైంది. టీడీపీ నేత రామచంద్రారెడ్డి, మహిళానేత విజయలకు గాయాలయ్యాయి.

ఓటుహక్కును వినియోగించుకున్న ప్రముఖులు

టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ గూడూరు పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో, ఎంపీ బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు గూడూరు సొసైటీ సెంటర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. రిటర్నింగ్ అధికారి కిరణ్ కుమార్ కూడా గూడూరులో ఓటు వేశారు.

యువత ఉత్సాహం...

ఈ ఎన్నికల్లో కొత్తగా ఓటు హక్కును వినియోగించుకునే యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొంది. మొదటిసారి ఓటును వినియోగించుకోవడంతో తమ అనుభూతిని కుటుంబసభ్యులు, స్నేహితులతో పంచుకున్నారు.

విధులకు దూరంగా డీఎస్పీ...

వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలతో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డిని ఎన్నికల విధులనుంచి దూరంగా ఉంచినట్లు తెలిసింది. డీఎస్పీపై కూటమి నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఎన్నికల విధుల నుంచి తప్పించి, రిజర్వులో ఉంచినట్లు తెలుస్తోంది. సోమవారం ఎన్నికల ప్రక్రియలో విశాఖ జిల్లాకు చెందిన ముత్యాలనాయుడు విధులు నిర్వహించారు.

కోట: మండలంలోని వెంకన్నపాళెం పోలింగ్ బూత్‌లో కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య దంపతులు ఓటు వేశారు. అదే విధంగా చంద్రశేఖరపురంలో ఎన్ఆర్ఐ మేరిగల మురళి ఓటు వేశారు. వెంకన్నపాళెం పోలింగ్ కేంద్రానికి 95 ఏళ్ల వృద్ధురాలు పట్టుబట్టి ఓటు వేసి వెళ్లింది. అదే విధంగా శ్రీలక్ష్మమ్మ కాలనీ, వెంకన్నపాళెం పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 7.30 గంటల వరకు పోలీస్ బందోబస్తు మధ్య ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా గూడలి, వెంకన్న పాళెం, కోటలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు అరగంటపాటు అసౌకర్యానికి గురయ్యారు.

వాకాడు: మండలంలోని జెమిన్‌కొత్తపాళెం మినహా మిగతాచోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కూటమి నాయకులు, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసులు కల్పించుకుని సర్ది చెప్పారు.

చిట్టమూరు: మండలంలోని 248, 249, 256, 257 పోలింగ్ కేంద్రాలను గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఎన్నికల సరళిపై టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడును అడిగి తెలుసుకున్నారు.





వెంకన్నపాళెంలో ఓటు వేసిన కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి దంపతులు - కేశవరం పోలింగ్ బూత్ వద్ద ఓటర్లు - వెంకన్నపాళెంలో ఓటు వేసిన 95 ఏళ్ల వృద్ధురాలు

చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

ఎంపీ ఓట్లలో భారీగా క్రాస్ ఓటింగ్!






భీమవరంలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ కుటుంబసభ్యులు - కాదలూరు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన కిలివేటి సంజీవయ్య - బారులు తీరిన ఓటర్లు

తడ, మే 13: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఓటర్లు పొటెత్తారు. ఉదయం 6.30 గంటల నుంచే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. అందులో మహిళలు సహా సుదూరప్రాంతాల ఓటర్లు ఎండను సైతం లెక్కచేయకుండా ఉత్సాహం కనబరిచారు. అయితే నియోజకవర్గంలో పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి.

● తడ మండలం గ్రద్దగుంట, వెండ్లూరుపాడు, మాంబట్టు, రామాపురం కుప్పం, పెరియవట్టు, సూళ్లూరుపేట పట్టణంలో 8 కేంద్రాలలో పెళ్లకూరు మండలంలో పునబాక, పెళ్లకూరు, దొరవారిసత్రం మండలంలో కొత్తపల్లి, పోలిరెడ్డిపాళెం, నేలపట్టు, నాయుడుపేట పట్టణంలో రెండుచోట్ల, ఓజిలి మండలంలో బత్తలాపురం, కురుగొండ్లలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. చిన్నచిన్న తోపులాటలు, వాగ్వాదాలు తప్ప ఎక్కడ ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తలేదు. రాత్రి 10 గంటల వరకు సూళ్లూరుపేట నియోజకవర్గంలో 79.48 శాతం ఓట్లు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మొత్తం ఓటర్లు 2,42,610 మందికిగానూ 1,94,378మంది ఓటు వేశారు. కాగా 2019లో 81.71 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈ ఎన్నికల్లో 1.59 శాతం ఓటింగ్ తగ్గింది.

● అన్నమేడులో టీడీపీ, వైసీపీల మధ్య వాగ్వాదం జరుగుతున్న సమయంలో ఎస్ఐ గోపీ లాఠీకి పనిచేప్పే క్రమంలో పొరపాటున ఓ మహిళకు తగలడంతో గాయమైంది. దీంతో గ్రామస్తులు తిరగ బడ్డారు. అధికారులు సర్దిచెప్పారు.

● పెళ్లకూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని మధ్యాహ్నం 3 గంటల నుంచి అధికారులు హౌస్ అరెస్టు చేశారు.

● పలుచోట్ల క్రాస్ ఓటింగ్ జరిగిందన్న గుసగుసలు ఉన్నాయి. ముఖ్యంగా ఎంపీ అభ్యర్థి విషయంలో ఈ క్రాస్ ఓటింగ్ భారీగా జరిగినట్లు తెలుస్తోంది. టీడీపీ పోటీలో లేకపోవడం, బీజేపీ అభ్యర్థికి ఓటు వేసేందుకు ఆసక్తి చూపకపోవడం గమనార్హం. పైగా కొంతమంది ఓటర్లు ప్రధాన పార్టీలకు కాకుండా ఎంపీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లుగా తెలుస్తోంది.

● సాయంత్రం 6 గంటల తరువాత కూడా ఓటర్లు పెద్దఎత్తున క్యూలో నిలబడ్డారు. దీంతో అధికారులు వారికి టోకెన్లు పంపిణీ చేసి ఓటు హక్కు కల్పించారు.

● సూళ్లూరుపేట నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేర్చారు.

ఎండను సైతం లెక్క చేయకుండా...





వెంకటగిరి పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకున్న కురుగొండ్ల రామకృష్ణ, ఆయన కుమార్తె లక్ష్మీసాయిప్రియ, భార్య సింధు - వేపినాపి పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కురుగొండ్ల - ఓటు వేసిన రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి/ డక్కిలి, మే 13: నియోజకవర్గంలో చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ గడువు ముగిసినా కేంద్రాల్లో వందలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలైన్లలోనే ఉండిపోయారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి మొత్తం 80.30 శాతం మంది ఓటర్లు కు పైగా తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,43,582 ఓట్లకుగానూ 1,95,606 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మహిళలు 98,827 మంది, పురుషులు 96,766 మంది ఇతరులు ఇద్దరు తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు.

● నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎండను సైతం లెక్కచేయకుండా ఓటర్లు క్యూలో నిలబడి ఓటు వేశారు.

●ఈ ఎడాది పురుషుల కంటే మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● అదే విధంగా విద్యా, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్న యువత తొలిసారి పెద్దఎత్తున తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● నియోజకవర్గంలో అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించడం, అనుభవం లేని సిబ్బందిని ఎన్నికల విధులకు వినియోగించడంతో ఉదయం పోలింగ్ కొంత ఆలస్యం అయ్యింది.

● టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి 9వ వార్డులోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకొన్నారు.

● వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పట్టణంలోని 8వ వార్డు పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● డక్కిలి మండలం ఆల్తూరుపాడులోని పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ క్యూలో వున్న మహిళలు, వృద్ధు పట్ల దురుసుగా ప్రవర్తించడంతో గ్రామస్తులు అతనిపై దాడి చేయడంతో పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు.

● డక్కిలి పోలింగ్ కేంద్ర వద్ద వైసీపీ నాయకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు లాఠీ చార్జి చేయడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది

● డక్కిలి మండలం పాతనాలపాడు పోలింగ్ కేంద్ర వద్ద మహిళల పట్ల, టీడీపీ ఎజెంటుపై ఎన్నికల విధుల్లో వున్న బీఎస్ఎఫ్ సిబ్బంది దురుసుగా వ్యవహరించారని గ్రామస్తులు చెప్పారు.

● రాపూరు మండలం వేపినాపిలోని పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ నేతలు దౌర్జన్యానికి దిగి ఏకపక్షంగా ఓట్లు వేసుకున్నట్టు ఆ పార్టీ నాయకులు చెప్పారు. సమాచారం అందుకున్న టీడీపీ అభ్యర్థి రామకృష్ణ అక్కడికి చేరుకోవడంతో వైసీపీ నేతలు ఆయనతో వాగ్వాదానికి దిగారు.



కమ్మవారిపల్లిలో క్యూలో ఉన్న ఓటర్లు

● ఈవీఎంలు మొరాయింపుపై ఆర్వోకి ఫిర్యాదు చేసిన వెంటనే ఆయన స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు.



నాయుడుపేటలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆస్ట్రేలియా నుంచి వచ్చిన మునీశ్వర్



వాకాడులో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు



గూడూరులో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌పై వస్తున్న దివ్యాంగుడు

ఆల్తూరుపాడులో టీడీపీ నాయకులపై కానిస్టేబుల్ దౌర్జన్యం

● డక్కిలిలో ఎస్ఐ చౌడయ్య లాఠీచార్జి



టీడీపీ నాయకులతో వాగ్వాదం చేస్తున్న కానిస్టేబుల్

డక్కిలి/ వెంకటగిరిటౌన్, మే 13: సార్వత్రిక ఎన్నికలు చెదురు మదురు సంఘటనలు మినహా డక్కిలిలో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటలకే ఓటింగ్ పారంభం అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో 15నిమిషాలు పాటు ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం యంత్రాలు మోరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. డక్కిలి పోలింగ్ స్టేషన్‌లో ఎస్ఐ చౌడయ్య టీడీపీ నాయకులపై లాఠీ చార్జి చేసుకున్నారు. ఆల్తూరుపాడు పోలింగ్ స్టేషన్ వద్ద కానిస్టేబుల్ వైసీపీ నాయకులకు అనుకూలంగా ఉండడంతో ప్రశ్నించిన టీడీపీ నాయకులపై దాడి చేశారు. దీంతో టీడీపీ నాయకులు కానిస్టేబుల్‌పై మందలించడంతో పోలీసులు వచ్చి గొడవను సర్దుమణించారు. దీంతో కానిస్టేబుల్ వేరే ప్రాంతానికి పంపించారు. అదే విధంగా పాతనాలపాడు పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌లపై కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించారు. తొలిసారిగా ఓటు హక్కును యువత వినియోగించుకున్నారు. వారు సైకిల్, బీజేపీకి వేసి పోలింగ్ స్టేషన్ బయకు వచ్చి ఆనందం వ్యక్తంగా చేశారు. తొలి ఓటును టీడీపీకి వేయడం సంతోషంగా ఉందని సంతోషాన్ని చేసి, రాష్ట్రాభవిష్యత్తు కోసం టీడీపీకి ఓటు వేయడం గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీతో కలిసి ఎస్ఐ ఓవరాక్షన్

టీడీపీ అభ్యర్థి పాశం విమర్శ

గూడూరు, మే 13: వైసీపీ నాయకులతో కలిసి చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి ఓవరాక్షన్ చేయడమే కాకుండా అభ్యర్థినైన తనతోపాటు తమ పార్టీ దళిత నేతలపై దాడి చేశారని గూడూరు కూటమి అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ మండిపడ్డారు. సోమవారం మధ్యాహ్నం చిల్లకూరులో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడి చేస్తున్నాయన్న సమాచారంతో తాను అక్కడకి వెళ్లానని ఆ సమయంలో ఎస్ఐ అనుచితంగా వ్యవహరించారన్నారు. టీడీపీ కార్యకర్తలే లక్ష్యంగా లాఠీలతో బాదుతుండగా ప్రశ్నించిన తనపై కూడా దురుసుగా ప్రవర్తించారన్నారు. దీంతో తన చేతికి కూడా గాయమైందన్నారు. అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. చిల్లకూరులో ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న నాటినుంచి ఎస్ఐ దళితులపైన దురుసుగానే ప్రవర్తిస్తున్నారన్నారు. చిల్లకూరులోని 114, 115 బూత్‌లలోకి వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్‌తోపాటు కొందరు వైసీపీ నాయకులు గుంపులుగా వెళతుండడాన్ని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. దీంతో ఓర్వలేని వైసీపీ అభ్యర్థి తన అనుచరులతో టీడీపీ నాయకుడు కొండా రామచంద్రారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న ఎస్ఐ అంజిరెడ్డికి వైసీపీ నాయకులు పురమాయించడంతో ఆయన రామచంద్రారెడ్డిపై, దళిత మహిళ మద్దాలి విజయ, మద్దాలి వెంకటరాఘయ్యపై విచక్షణారహితంగా లాఠీతో దాడిచేయడంతో గాయాలయ్యాయని సునీల్‌కుమార్ వివరించారు. అడ్డుకునే సమయంలో తనపై కూడా ఎస్ఐ దాడి చేయడంతో చేతికి గాయమైందన్నారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌కు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సునీల్‌కుమార్ పేర్కొన్నారు.

వలంటీర్లపై చర్యలు తీసుకోండి

గూడూరు, మే 13: మాయ మాటలు చెప్పి 22వ వార్డు రాణిపేటకు చెందిన ఓటర్లకు చెందిన స్లిప్పులను తీసుకు వెళ్లిన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఆర్వో కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు వలంటీర్లు 22వ వార్డులోని సుమారు 70 కుటుంబాలకు చెందిన వారి నుంచి బీఎల్‌వోలు అందజేసిన ఓటర్ స్లిప్పులను సరి చేసి తెచ్చిస్తామని నమ్మబలికి తీసుకు వెళ్లారన్నారు. దీంతో తాము ఓటుహక్కును వినియోగించుకోవాలంటే ఓటర్ కాగితాలు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందని తెలిపారు.

దుండగులను వెంటనే శిక్షించాలి

వెంకటగిరి టౌన్, మే 13: పట్టణంలోని క్రాస్ రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం మెడ నరికిన దుండగులను వెంటనే శిక్షించాలని సీఐటీయూ తిరుపతి జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య సోమవారం డిమాండ్ చేశారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన దుర్మార్గుల్ని వెంటనే శిక్షించాలని కోరారు.



నాయుడుపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ శోభారాణి, టీడీపీ నాయకులు



చిట్టమూరులోని బూత్‌నెం.249లో ఓటర్లకు అభివాదం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్



సూళ్లూరుపేట నియోజకవర్గంలో వివిధ మండలాలనుంచి ఈవీఎంలు సహా ఎన్నికల సామగ్రిని సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో సూళ్లూరుపేట పట్టణంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి తీసుకొస్తున్న ఎన్నికల సిబ్బంది

- సూళ్లూరుపేట టౌన్